# కర్నూలు | నంద్యాల వార్త

29 జూలై , 2023 శనివారం పేజీలు 4


## మొక్కలు నాటుదాం- పర్యావరణాన్ని రక్షించుకుందాం - కలెక్టర్ డాక్టర్.సృజన

**: ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం కార్యక్రమం**

**కర్నూలు జూలై 28, ప్రభాతవార్త :** జిల్లాలో విరివిగా మొక్కలు నాటి , పర్యావరణాన్ని రక్షించుకోవలసిన బాధ్యత మనపై ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన సంబంధిత అధికారులను సూచించారు. శుక్రవారం నగర శివార్లలోని జగన్నాథ గట్టు, డ్వామా డిసిబిసి ట్రైనింగ్ సెంటర్ ప్రాంగణంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా డ్వామా వారి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన మొక్కలు నాటినారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈరోజు ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం కార్యక్రమం సందర్భంగా డ్వామా వారి ఆధ్వర్యంలో దాదాపు 1200 మొక్కలు నాటే కార్యక్రమం జరుపుకుంటున్నామని అన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణలో బాగంగా పచ్చదనం పెంపుదలకు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా మొక్కలను విరివిగా నాటాల్సిన అవసరం ఎంతైనాఉందన్నారు. డ్వామా వారి ఆధ్వర్యంలోని, ఆలూరు, బనవాసి, కాల్వబుగ్గ నర్సరీలలో దాదాపు ఐదు లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయని వీటిని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, సచివాలయాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. మొక్కలు నాటడం ఒకరోజుతో సరిపెట్టకుండ వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు ముఖ్యంగా అధికారులు ఈ కార్యక్రమంలో అత్యధికంగా పాల్గొనేలా చూడాలన్నారు. అనంతరం డ్వామా డిసిబిసి ట్రైనింగ్ సెంటర్ ప్రాంగణంలో ఉన్న వనాన్ని డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి జిల్లా కలెక్టర్‌కు వనములో ఉన్న 2500 టేకు చెట్లను, అల్ల నేరేడు చెట్లను, మామిడి చెట్లను, జామ చెట్లను, సీతాఫల చెట్లను, చూపించారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ భార్గవ్ తేజ, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, మెప్మా పీడీ మరియు డిఆర్డిఏ ఇన్చార్జి పిడి నాగ శివలీల. జిల్లా ఫారెస్ట్ అధికారి శివ శంకర్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు,డిపిఓ నాగరాజు నాయుడు,తదితర అధికారులు పాల్గొన్నారు.



## నూతన సి.సి.రోడ్లను.. ప్రారంభించిన ఎమ్మెల్యే

**నందికొట్కూరు,జూలై 28,ప్రభాతవార్త:** మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం రూ.20 లక్షల నిధులతో నూతనంగా వేసిన సి.సి. రోడ్లను నియోజకవర్గం ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ ప్రారంభించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేకు స్తానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటిఇంటికి తిరిగి సమస్యలు తెలుసుకున్నామని గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు కావాలని కోరడంతో ప్రభుత్వం నుండి వచ్చిన నిధులతో రోడ్లను వేయడం జరిగిందని, గ్రామంలో అందరు కలిసికట్టుగా అభివృద్ధికి సహాకరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాధవరం సుశీలమ్మ, బ్రాహ్మణకొట్కూరు సింగిల్ విండో చైర్మన్ హరిసర్వోత్తమరెడ్డి, నందికొట్కూరు సింగిల్ విండో చైర్మన్ సగినేల ఉశేనయ్య, పంచాయితీరాజ్ డి.ఇ.శ్రీధర్, ఏఇ ప్రతాపరెడ్డి, వైకాపా నాయకులు మాధవరం యేసురత్న, యం.రత్నం, వేల్పుల నాగన్న, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

**మొహారం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే:** దామగట్ల గ్రామంలో మోహారం సందర్భంగా పీర్లచావిడిలో కొలువైన పీర్లను దర్శించుకొని ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గంలో ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లుగా ఎమ్మెల్యే తెలిపారు.



## భారీ వర్షాలు వరదల పట్ల అప్రమత్తంగా ఉండండి..

**- కలెక్టర్లుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విసిలో సూచనలు**

**రాష్ట్రంలో భారీ వర్షాలు నదుల్లో వరద ప్రవాహాల పట్ల అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లుకు సూచించారు. శుక్రవారం అన్ని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో తాడేపల్లి నుంచి విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్, జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డిఆర్వో పుల్లయ్య తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు**



**నంద్యాల, జూలై 28, ప్రభాతవార్త:** ఈసం దర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ వరద ప్రాంతాల్లో పర్యటించాలని, ముంపు ప్రాంతాలు పంట పొలాలను సందర్శించి బాధితులకు అండగా నిలబడాలని ఆదేశించారు. జిల్లాలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలస్థాయి, సచివాలయ స్థాయిలో కూడ సమాచార సేకరణ ఉండాలన్నారు. వాలంటీర్లను అప్రమత్తం చేయండి,మునక ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటి దిగ్బందంలో ఉన్న ప్రజలకు 25కేజిల బియ్యం, కందిపప్పు, ఆయిల్, ఎర్రగడ్డలు, ఉల్లిగడ్డలు, రేషన్ అందించాలన్నారు. తాగునీటి ప్యాకెట్లు పంపిణి చేయాలన్నారు, పారిశుద్ద్యంపై ప్రత్యేక దృష్టిపెట్టి అన్నిచోట్ల బ్లీచింగ్‌చేయాలన్నారు. హెల్త్‌క్యాంపులు నిర్వహించాలన్నారు. జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాల వల్ల చెరువులు, వాగులు, వంకలు, రహదారుల్లో నీటి ప్రవాహాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బి ఎస్ఈని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ద్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డిపిఓను ఆదేశించారు. వరద ప్రవాహాలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా జాయింట్ కలెక్టరుగా రాహుల్ కుమార్‌రెడ్డి



**నంద్యాల విద్య, జూలై 28, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లాకు నూతనంగా జాయింట్ కలెక్టరుగా తాటిమాకుల రాహుల్ కుమార్‌రెడ్డిని నియమిస్తు ప్రభుత్వం జిఓ ఆర్‌టినం.1484ను చీఫ్ సెక్రెటరీ కెఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో ఆరుగురు ఐఏఎస్ బదిలీలు చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన గంధం చంద్రుడిని 2010 ఐఏఎస్ అధికారిని హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ డైరెక్టరుగా బదిలీచేశారు. నంద్యాల జిల్లాలో ఉండి వెళ్లిపోయిన టి నిశాంతిని జాయింట్ సెక్రెటరీగా ల్యాండ్ అడ్మిన్ట్రేషన్ కార్యాలయంలో బదిలీ చేశారు. నంద్యాల జిల్లాకు బదిలీపై జేసిగా వచ్చిన తాటిమాకుల రాహుల్‌కుమార్‌రెడ్డి 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన టెక్కెలి సబ్‌కలెక్టరుగా ఉన్నారు. ఇతన్ని జాయింట్ కలెక్టరు అడిషనల్ డిస్ట్రిక్ మేజిస్ట్రేట్‌గా నంద్యాల జిల్లాకు బదిలీచేశారు. జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్ ఇంతవరకు ఇంచార్జ్‌గా బాధ్యతలు నిర్వహించారు. జేసిగా వచ్చిన రాహుల్‌కుమార్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొత్త జేసి రాకతో నంద్యాల జిల్లాలో పనులు వేగవంతంగా జరిగేందుకు అవకాశం ఉన్నట్లు తెలుసోంది.

## రైతుల సంక్షేమమే.. నా లక్ష్యం..!

**- కెడిసిసి బ్యాంకు చైర్మన్ ఎస్‌వి విజయ మనోహారి**



**కర్నూలు కలెక్టరేట్, జూలై 28, ప్రభాతవార్త:** జిల్లాలోని రైతుల సంక్షేమం కోసం ఎల్ల వేళల సహాయ సహకారాలు అందించి రైతుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని కెడిసిసి బ్యాంకు చైర్మన్ విజయ మనోహరి తెలిపారు. కెడిసిసి బ్యాంకు చైర్మన్‌గా నియమితులయిన విజయ మనోహరి స్థానిక లక్ష్మీ ఫంక్షన్ హాల్ నందు చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయడం జరిగింది. ఈసందర్భంగా కెడిసిసి బ్యాంకు సిఇఓ రామాంజనేయులు సభకు అధ్యక్షత వహించి ప్రమాణస్వీకారం చేయించడం జరిగింది. ఈకార్యక్రమానికి కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీజగన్‌మోహన్‌రెడ్డి అదేశాల మేరకు తాను పదవి చేపట్టడం జరిగిందని నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఉమ్మడి జిల్లాలోని రైతాంగానికి బ్యాంకు నుండి వారికి చేయాల్సిన సహాయ సహకారాలు అందిస్తానని కెడిసిసి బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపించి రాష్ట్రంలో మంచి గుర్తింపు తెస్తానని తెలిపారు. ఈసందర్భంగా బ్యాంకు పాలక మండలి సభ్యులు ఉద్యోగులు వారికి అభినందనలు తెలిపారు. ఈయొక్క సహాయ సహకారాలు నాకు ఇచ్చి బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపించాలని ఉద్యోగులకు విన్నవించారు. కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు





## జగనన్న స్పందన 14400కు ఫిర్యాదు.. ఎసిబి అధికారులు దాడి..!

**- వైద్య ఉద్యోగి సీనియర్ అసిస్టెంటు రూ.6 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం**




**నంద్యాల, జూలై 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అవినీతి నిరోధించడానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి టోల్‌ఫ్రీ నం.14400 జగనన్న స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తే ఉద్యోగుల భరతం పడతామని అవినీతి అధికారులపై కొరడా ఝుళిపిస్తామని ఇచ్చిన ఆదేశాల మేరకు ఇటీవలనే ఏడాది క్రితం జిల్లాను ఏర్పాటు చేశారు. ఒకవైపు సంతోషంగా ఉన్నప్పటికి అవినీతి అధికారులు వారి పద్దతులు మార్చుకోకపోవడం విశేషం. జిల్లాలో ఏ ఫైల్ ముందుకు సాగాలన్నా, అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో జిల్లాలో అనుమతులు లేనివి ఎన్నో ఉన్నాయి. నంద్యాల జిల్లాలోని వైద్యశాఖలో అవినీతి పేరుకుపోయిన దృష్ట్యా ఓ బాధితుడు 14400కు ఫిర్యాదు చేసి లంచం తీసుకునే వ్యక్తిని పట్టించిన వైనం చోటుచేసుకుంది. ఎసిబి డిఎస్పీ తేజేశ్వర్‌రావు తెలిపిన వివరాల మేరకు నంద్యాల వైద్య ఆరోగ్యశాఖలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆంజనేయులు తన దాచుకున్న జిపిఎఫ్ డబ్బుల నుంచి అత్యవసరాల నిమిత్తం రూ.5 లక్షలను పార్టుఫైనల్‌గా తీసుకోవడానికి ధరఖాస్తు చేసుకున్నారు.ఈబిల్లులు ఉన్నతాధికారులకు పంపడానికి ఆ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంటు అశోక్‌కుమార్ రూ.6 వేలు లంచం ఇస్తేనే బిల్లు ప్రాసెస్ చేస్తానని చెప్పారు. గత కొద్ది రోజుల నుంచి ఈ విషయంలో తర్జనభర్జనలు జరుగుతున్నాయి. చివరికి ఆంజనేయులు టోల్‌ఫ్రీ నంబరు కాల్ చేసి తన సమస్యను అధికారులకు వివరించారు. దీంతో డిఎస్పీ తేజేశ్వర్‌రావు తన సిబ్బందితో దాడి చేసి రూ.6 వేలు డ్రైవర్ ఆంజనేయులు లంచం ఇస్తుండగా పైసలు తీసుకుంటున్న సీనియర్ అసిస్టెంట్ అశోక్‌కుమార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా దాడి చేసి పట్టుకున్నారు. దీని వెనుక ఇంకా ఏవరైనా ఉన్నారా అన్న కోణంలో ఏసిబి అధికారులు అన్వేషణ ప్రారంభించారు. నిబంధనల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిఎస్పీ తేజేశ్వర్‌రావు తెలిపారు.

**అన్ని కార్యాలయాల అధికారులు అప్రమత్తం:** నంద్యాల జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖలో అవినీతి జరిగిందని ఏసిబి అధికారులు దాడి చేసిన సంఘటన క్షణాల్లో పట్టణమంతా వ్యాపించింది. దీంతో అవినీతి అధికారులు అప్రమత్తం అయ్యారు. జిల్లాలోని మరికొన్ని శాఖల అధికారులపై ఎసిబి రహస్యంగా విచారణ జరుపుతున్నట్లు తెలుసోంది. జిల్లాలో రెవిన్యూ, ఆర్‌అండ్‌బి,



విద్యావ్యవస్థ, పంచాయితీరాజ్, ఎంపిడిఓ, ట్రెజరీ, రిజిష్ట్రర్ ఆఫీసు, వాణిజ్యపన్నుల, తెలుగుగంగ, మున్సిపల్ కార్యాలయం, ల్యాండ్ అండ్ రెవిన్యూ, ఇరిగేషన్, ఐసిడిఎస్, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత కార్యాలయం, బిసి సంక్షేమ సాధికారిత కార్యాలయం, హాస్టల్ వెల్ఫేర్ కార్యాలయల యాలతో పాటు పలు శాఖల అధికారులు అప్రమత్తం అయ్యారు. ఏ క్షణాన కార్యాలయాలపై ఎసిబి దాడి చేస్తుందోనన్న అనుమానంతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. 14400 టోల్‌ఫ్రీ నం. వచ్చిన తరువాత అవినీతి తగ్గుతుందని భావించినప్పటికి ఇంకా



## సమ ధర్మంతో కూడిన త్యాగమే.. మొహర్రం..!

- త్యాగాలను స్మరించుకునే పర్వదినం..
- ఇస్లాం క్యాలెండర్‌లో మొట్టమొదటి నెల..
- నేడు షహదత్ సందర్భంగా పీర్ల ప్రదర్శన
- షహదత్..షర్బత్, రోటీలు ప్రత్యేకం..
- ముస్లీం సోదరులకు అత్యంత పవిత్ర దినం..
- నేడు మొహర్రం.. పీర్ల పండుగ..

**కోసిగి, జూలై 28, ప్రభాతవార్త** "శాంతి..సమధర్మం..మానవత్యం.. త్యాగం.. కలగలిసినదే మొహర్రం పర్వదినం..త్యాగ నిరతికి ప్రతీకగా ముస్లింల మొదటి నెల మొహర్రం నిలుస్తుంది.. ప్రాణ త్యాగాలు చేసిన ప్రవక్తలను స్మరించుకుంటూ ఈ నెలను సంతాపదినాలుగా ముస్లీంలు జరుపుకుంటారు. ఈ నెల్లాళ్ల వారు ప్రాపంచిక సుఖ సంతోషాలకు దూరంగా గడుపుతారు..జిల్లా వ్యాప్తంగా మొహర్రంను శనివారం నిర్వహించుకుంటున్నారు".. మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రంను హిందూ, ముస్లీంలు నిర్వహిస్తారు.. హుస్సేన్, ఆయన పరివారం అమరత్వం పొందిన రోజు(షహదత్) సందర్భంగా మొహర్రంను జరుపుకుంటారు.. ముస్లీంలు విశ్వసించే హిజ్రీ క్యాలెండర్ మాసమే మొహర్రం..ఈ నెలలో ముస్లీంలు సంతాప దినాలు జరుపుకొంటారు. ఇస్లాం మత ప్రవక్త మహ్మద్ మనవడు ఇమాం హుస్సేన్‌తో పాటు ఆయన అనుచరులు 72మంది వీర మరణం పొందగా ఆ గుర్తుగా వారి పేర్ల మీద 'పీర్లు' ప్రతిష్టించి విషాద గీతాలు పఠిస్తూ వారి మరణం స్మరిస్తారు".. ఇస్లాం మతం కోసం ప్రాణ త్యాగం చేసిన ఇమాం హుస్సేన్ త్యాగాన్ని ఈ నెలలో స్మరిస్తారు. అంతేకాక నెల ప్రారంభం నుండి 6, 7, 8, 9 దినాలలో మొహర్రం కాగా 10వ రోజు షహదత్‌గా ఉపవాస దీక్షలు నిర్వహిస్తారని ముస్లీం మత పెద్దలు తెలుపుతున్నారు. ముఖ్యంగా ఈ మొహర్రంను శోక మాసమని, అలాగే ముస్లీంలు ఈ మాసంలో శుభకార్యాలు చేయరని, కొత్త దుస్తులు, వస్తువులు కూడా ఖరీదు చేయరని తెలుపుతున్నారు..

**ధర్మం, సత్యం కోసం:** మొహర్రం నెలలో యూప్రటీస్ నది ఒడ్డున కర్బలా మైదానంలో మహమ్మద్ ప్రవక్త మనువడు శాంతి కాముకుడైన ఇమామ్ హుస్సేన్‌కు, ఇస్లాం ధర్మాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించిన ఇరాక్ రాజు యజీద్‌కు మధ్య యుద్ధం జరిగింది. యజీద్ వద్ద నున్న సమానమైన బల సంపత్తి లేనప్పటికీ, ధర్మం, సత్యం, న్యాయాన్ని కాపాడేందుకు ఇమామ్ హుస్సేన్ తప్పనిసరి పరిస్థితుల్లో యుద్దానికి తలపడ్డారు. హుస్సేన్ అనుచరులు, కుటుంబ సభ్యులు, సైనికులు యుద్దంలో అసువులు బాసారు. మహమ్మద్ ప్రవక్తకు ప్రతి రూపంలా భక్తులు భావించి దర్శించుకునే హజరత్ అలీ అక్బర్(హుస్సేన్ కుమారుడు), ఇమామ్ హసన్ 13 ఏళ్ల కుమారుడు హజరత్ ఖాసీం యుద్దంలో పోరాడి అమరులయ్యారు..

2లో

## ఎల్‌ఎల్‌సి కాలువకు నీరు విడుదల



**హాలహర్వి, జూలై 28,ప్రభాతవార్త** ఆంధ్రా,కర్ణాటక జీవనాడి అయిన తుంగభద్ర జలాశయం నుంచి ఆంధ్రా ఎల్ఎల్‌సి కాలువకు డ్యాం అధికారులు నీరు విడుదల చేశారు. టిబి డ్యాం సెక్రటరీ నాగమోహన్ డ్యాం గేట్లకు ప్రత్యేక పూజలు చేసి ఎల్ఎల్‌సి కాలువకు నీటిని విడుదల చేశారు. కర్ణాటక ఎగువ ప్రాంతమైన శివమొగ్గ జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో తుంగభద్ర నదికి వరదనీరు ఉదృతంగా వస్తున్నాయి. దీంతో డ్యాంకు నీరు భారీగా చేరడంతో ఆంధ్రాకు తాగు,సాగునీరు అవసరాలు తీరేందుకు ఆంధ్రానీటి వాటా కింద శుక్రవారం 800క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కాలువకు నీరు విడుదల చేయడంతో ఆంధ్రా,కర్ణాటక రైతులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం టిబి డ్యాంలో 62.060టిఎంసిల నీరు నిల్వ ఉందని డ్యాం అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యాం నుండి ఔట్‌ఫ్లో 1078క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు తెలిపారు. డ్యాంకు ఇన్‌ఫ్లో 85866క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందన్నారు. ప్రస్తుతానికి ఎల్ఎల్‌సి కాలువకు మొదటి గేట్ నుంచి 800క్యూసెక్కుల నీరు కాలువకు విడుదల చేశామని డ్యాం అధికారులు తెలిపారు. ఆగస్టు 3వ తేదీ నాటికి ఆంధ్రా సరిహద్దు చింతకుంట 136వ కి.మీకు నీరు చేరుతాయని డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంకు నీరు విడుదల చేయడంతో రైతులు,ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టిబి డ్యాం సెక్రటనీ నాగమోహన్ మాట్లాడుతూ ఆంధ్రాలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు మాత్రమే 800క్యూసెక్కుల నీరు కాలువకు విడుదల చేశామని తెలిపారు. డ్యాంకు పూర్తిస్థాయిలో నీరు చేరినప్పుడు పంటల సాగుకు కూడా నీరు అందచేస్తామని తెలిపారు.



## పురుగుల మందు సేవించి.. రైతు ఆత్మహత్య..!

**దేవనకొండ,జూలై 28,ప్రభాతవార్త :** పురుగుల మందు సేవించి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని గుండ్లకొండ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆ గ్రామానికి చెందిన గుడిసె రాజు(34) తనకున్న ఎకరా పొలంతో పాటు ఐదెకరాల పొలాన్ని కౌలుకు చేసుకుని జీవనం కొనసాగిస్తుండేవాడు. వర్షాలు సక్రమంగా రాక పంటలు సరిగా పండక చేసిన అప్పులను ఎలా తీర్చాలో తెలియక మనస్థాపానికి గురై శుక్రవారం తెల్లవారుజామున క్రిమిసంహారక మందు సేవించాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. మృతునికి భార్యతో పాటు కుమార్తె,కుమారుడు కలరు. మృతుడు భార్య సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు.



## పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం



**నంద్యాల క్రైం, జూలై 28, ప్రభాతవార్త:** పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటామని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. రాజశేఖర్ అనే హోంగార్డు సెంట్రల్ వేర్‌హౌస్ వద్ద విధులు నిర్వహిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సేవించి దాడిచేయడంతో పాటు హత్యచేశారని గాయపడిన నంద్యాల ప్రభుత్వాసుపత్రికి చేర్చారు. చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం విధితమే. శుక్రవారం మృతిచెందిన రాజశేఖర్ కుటుంబానికి రూ.30 లక్షల చెక్కును అందజేశారు. ప్రభుత్వం నుండి రావాల్సిన బెనిఫిట్స్ అన్ని అందించడంతో పాటు రాజశేఖర్ భార్య యూనిట్ నందు హోంగార్డుగా ఉద్యోగం ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్పీతో హోంగార్డు కమాండెంట్ ఎం మహేష్‌కుమార్, అడిషనల్ ఎస్పీ జి వెంకటరాముడు, అడిషనల్ రిజర్వుడు ఎస్పీ చంద్రబాబు, ఎఆర్ డిఎస్పీ రంగముని, యాక్సిస్ బ్యాంకు మేనేజర్ పి శశికుమార్, కృష్ణ మోహన్, భ్రమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ అధినేతను కలిసిన టీడీపీ నాయకులు

**- వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపు**

**ఆదోనిలీగల్, జూలై28, ప్రభాతవార్త;** టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడిని గత గురువారం రాత్రి మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆదోని నియోజకవర్గం సమీక్షా సమావేశం జరిగింది. నియోజకవర్గ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు, మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడిసె క్రిష్ణమ్మ, సీనియర్ నాయకులు దేవేంద్రప్ప, భాస్కర్‌రెడ్డి, క్లసటర్‌ఇన్‌చార్జిలు, పట్టణ,మండల కన్వీనర్‌లు పాల్గొన్నారు.



# సమ ధర్మంతో కూడిన త్యాగమే.. మొహర్రం..!

(మొదటి పేజీ తరువాయి ) :
హుస్సేన్ తన ఆరేళ్ల కుమార్తె షకీనా దాహం తీర్చేందుకు హజరత్ అబ్బాస్‌ను నదీ తీరానికి పంపగా, పొదల చాటు నుంచి అబ్బాస్‌ను యజీద్ సైన్యం అంతం చేసింది. హజరత్ హుస్సేన్ చిన్న కుమారుడు ఆరు నెలల వయసున్న హజరత్ అలీ సస్గర్ ఏడు రోజులుగా అన్న పానీయాలు లేక దాహంతో విలవిల్లాడుతుండగా 10వ రోజు తల్లిపాలు సైతం ఇంకిపోయిన దశలో తల్లి ఒడిలో రోధిస్తుండగా, ఆ పసికందును సైతం యజీద్ సైన్యం హతమార్చింది.. ఆ పసికందు కంఠం నుంచి కారుతున్న రక్తం భూమిపైన పడబోతుండగా భూమి ఒక్కసారిగా ప్రతిధ్వనించి హుస్సేన్ ఏ పాపం ఎరుగని ఆ పసికందు రక్తం నాపై పడితే ప్రపంచం అంతమయ్యేంత వరకు ఏ విధమైన ఆహార ధాన్యాలు నా నుంచి మొలకెత్తవు అని చెబుతుంది.. ఆ రక్తాన్ని ఆకాశం వైపు వేయబోయగా ఆకాశం కూడా ప్రతిధ్వనించి ఈ పసికందు రక్తం నా వైపు వస్తే ప్రపంచం అంతమయ్యేంత వరకు నా నుంచి ఒక్క వర్షపు జల్లు కూడా కురవదు..అని చెబుతుంది. నింగీ నేలా నిరాకరించిన ఆ రక్తాన్ని ఇమామ్ హుస్సేన్ తన ముఖానికి పూసుకుంటాడు. హుస్సేన్ మొహర్రం నెల 10వ రోజు యుద్ధ విరామంలో ప్రార్థనకు మోకరిల్లిన సమయంలో యజీద్ సైన్యం శిరస్సు ఛేదించి హతమార్చింది.. న్యాయం, ధర్మం పరిరక్షించేందుకు దైవం చూపిన మార్గంలో పయనించి రక్తం ధారపోసి ప్రాణాలు అర్పించిన హుసైన్-హుసైన్ త్యాగనిరతికి షియాలు రక్తతర్పణం చేస్తారు..

**షర్బత్, రోటీలు:** ఇక ఈ మాసంలోని ప్రత్యేకంగా చెప్పుకోవల్సినవి కొన్ని తెలియజేశారు. పండుగలో షర్బత్, రోటీల ప్రాముఖ్యతను సంచరించుకుంటున్నాయి. కర్బాలా మైదానంలో ఇమాం హుస్సేన్, ఆయన అనుచరులు, పిల్లలు, మహిళలకు యజీద్ సైన్యం కనీసం మంచినీరు కూడా ఇవ్వని పరిస్థితి. ఈ స్థితి నేడు ఎవ్వరికి రాకూడదంటూ ముస్లీంలు నీళ్ళ, లేక పాలలో బెల్లం తీపి, సొంపు కలిపి షర్బత్ తయారు చేసి అందరికి తాపుతారు. అంతేకాక ఆకలితో ఎవరూ మరణించరాదని చక్కెర, ఎండుఫలాలతో రొట్టెలు తయారు చేసి దానం చేస్తుంటారు. ఆ కాలంలో హుస్సేన్ పెరుగు అన్నం సద్ది కట్టుకుని వెళ్లారంటూ నేటికి పెరుగన్నం(బుత్తి) తయారు చేసి పంచుతారు.

**ఆకట్టుకునే అలాయ్, బలాయ్:** మొహర్రం పండుగలో ముఖ్యంగా మసీదుల వద్ద ఏర్పాటు చేసిన పీర్ల చావిడిల ఎదుట అలాయి(పెద్ద గుంత) తవ్వుతారు. దానిలో అగ్ని గుండాన్ని రాజేసి దాని చుట్టూ ప్రజలు, పీర్లు ఎత్తుతారు. యువకులు అసోయి-ధూలా ఆరతి-కాళ్ల గజ్జెల గమ్మత్తి, దూలదూలారే ఖాసీమా, దుమ్ము లేసరా ఖాసీమా, అంటూ వివిధ పాటలతో నృత్యాలు చేసుకుంటూ అగ్ని గుండం చుట్టూ తిరుగుతారు. వివిధ సన్నివేశాలతో కాలక్షేపం చేస్తారు. తెల్లవారు జామున 3 గంటలకు పీర్లను ఎత్తుకొని గ్రామాల్లో ఊరేగిస్తారు.

**రుధిర తర్పణం:** ధర్మసంస్థాపనే లక్ష్యంగా మహమ్మద్ ప్రవక్త మనమడు ఇమామ్ హుస్సేన్, ఆయన అనుచరులు 72 మంది చేసిన ప్రాణ త్యాగాన్ని స్మరిస్తూ ముస్లీంలు తమ రుధిరం(రక్తం)తో జోహార్లు అర్పిస్తారు.. యా హుస్సేన్..యా అలీ అంటూ గ్రామాల్లో మాతమ్ నిర్వహిస్తారు.. నుదుటిపై కత్తి గాట్లు పెట్టి రుధిర తర్పణం చేస్తారు.. కత్తులు, బ్లేడ్‌లు, గొలుసులతో ముస్లీంలు తమ శరీరాలను గాయపర్చుకుని రక్తం చిందిస్తారు..అనంతరం పీర్లతో ఊరేగింపు నిర్వహిస్తారు..

**చావిడిలలో పీర్ల ప్రతిష్ట:** ఇమామ్ హుస్సేన్ వీర మరణానికి నిదర్శనంగా చావిడిలల్లో పీర్లను ప్రతిష్టించి పదిరోజుల పాటు పూజించిన వీరు మాత్రం పూజలను కులమతాలకతీతంగా నిర్వహిస్తుంటారు.. 11వ రోజు తెల్లవారుజామున అగ్ని గుండంలో పీర్లు ప్రవేశించి ఊరంతా గ్రామోత్సవం నిర్వహిస్తారు.. అదే రోజు సాయంత్రం పీర్లను చావిడి నుండి తీసుకుని గ్రామ శివారులోని పొలిమేర వరకు తీసుకు వెళ్లి వాటిని శుభ్రం చేసి తిరిగి తీసుకురావడంతో మొహర్రం పూర్తవుతుంది.. మొహర్రం పండుగ రోజు ఉపవాసం చేస్తే ఏడాదిపాటు ఫలితం ఉంటుందని ముస్లీం సోదరులు బలంగా నమ్ముతుంటారు.. ఇదే రోజు ఇంట పెద్ద తన కుటుంబాన్ని ఇరుగుపొరుగు కుటుంబాల వారిని ఎంతో సంతోషంగా చూసుకుంటే అంత సంపాదన సిద్దిస్తుందని పెద్దలు బెబుతున్నారు..

**మొహర్రం ప్రదర్శనను శాంతియుతంగా చేయాలి: ఎస్పీ కృష్ణకాంత్..**
మొహర్రం పీర్ల ప్రదర్శనను ప్రతి ఒక్కరు శాంతియుతంగా ప్రదర్శించి వేడుకలను చేసుకోవాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు.. ఎక్కడ కూడా పీర్లను పట్టే విషయంలో ఇరువర్గాల వారు ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.. ముఖ్యంగా హిందు ముస్లీంలు సోదర భావంతో కలసి మెలసి పీర్ల ఊరేగింపును ప్రదర్శించాలని కోరారు..

## రజకులను రాజకీయంగా ఎదగాలి...

– రాష్ట్రంలో 40 లక్షల మంది రజకులు ఉన్నారు– వారి ఓట్లే గెలుపునకు పునాది

**నంద్యాల టెక్కె, జూలై 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రజకులను ఓటుబ్యాంకుగా వాడుకుంటున్నారని రజకులను రాజకీయంగా ఎదిగేందుకు కొందరు అణగదొక్కుతున్నారని అలాంటి వారిపై ఉద్యమించి రాబోయే ఎన్నికల్లో రజకుల సత్తా ఏమిటో చూపిస్తామని ఏపీ రజక ఎస్సీ సాధన చైతన్య సమితి అధ్యక్షులు నందవరం శ్రీనివాసులు పేర్కొన్నారు. నంద్యాల జిల్లాలో ఉన్నటువంటి రజకుల సమస్యలపై వారికి అండగా ఉంటామని తెలిపారు. రాష్ట్రంలో 40 లక్షల మంది రజకులు ఉన్నారని వారి ఓట్లతోనే గెలుపోటములు నిర్ధారణ అవుతుందని పేర్కొన్నారు. ఆళ్లగడ్డ మండలం కోట కందుకూరు గ్రామంలో రజకులకు చెందిన సాగుభూమిని ఓ వ్యక్తి భూ అక్రమణకు పాల్పడినందున మండల తహశీల్దార్‌కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. రజకులపై కొందరు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం భూములను, ఆస్తులను స్వాధీనం చేసుకొని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పట్టణాల్లో ప్రజలకు ప్రతి ఒక్క కులానికి చెందిన వారికి మురికి బట్టలు ఉతికి ఎనలేని సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ఐక్యమత్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్, కోటకందుకూరు గ్రామ రజకులు నరసింహా, మద్దిలేటి, రజక శేషు తదితరులు హాజరయ్యారు.

## క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసన ర్యాలీ

**వెలుగోడు, జూలై 28, ప్రభాతవార్త:** మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ వెలుగోడు పట్టణంలో మేజర్ గ్రామపంచాయితీ సర్పంచ్ జైపాల్, చర్చ్‌ఫాదర్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం స్థానిక సి.యస్.ఐ.చర్చి నుండి రెవెన్యూ కార్యాలయం వరకు మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండడం దారుణమని దోషులను పట్టుకోవాలని నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్భంగాపలువురు మాట్లాడుతు గత నాలుగు నెలలుగా మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలు బయటి ప్రపంచానికి తెలియకుండా కుట్రలు చేయడం దారుణమని వారు విమర్శించారు. అనంతరం తహాసిల్దార్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లిటిల్‌ఏంజర్స్ పాఠశాల కరస్పాండెంట్ డా.ఎం.ఎఫ్.ఇమ్మానియేల్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## 30న మండల సర్వసభ్య సమావేశం

**పెద్దకడబూరు, జూలై 28, ప్రభాతవార్త:** ఈ నెల 30వ తారీఖున ఆదివారం ఉదయం 11:00 గంటలకు మండల కేంద్రమైన పెద్దకడబూరులో స్థానిక ఎంపిడిఓ కార్యాలయం నందు ఎంపిపి శ్రీవిద్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ శ్రీనివాసరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలో ఉన్న సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తప్పకుండా హాజరు కావాలని ముఖ్యంగా వివిధ శాఖల అధికారులు గత మూడు నెలలకు సంబంధించిన అభివృద్ధి నివేదికలతో హాజరు కావాలన్నారు.

## ఘనంగా మొహరం వేడుకలు

– సర్పంచ్ మొగతాల్ అరుణ్‌కుమార్

**దేవనకొండ, జూలై 28, ప్రభాతవార్త :** మండలంలోని తెర్నేకల్ గ్రామంలో మొహరం వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఇందులో గ్రామ సర్పంచ్ మొగతాల్ అరుణ్‌కుమార్, ఉప సర్పంచ్ భర్త బెల్ ఈరన్న, ఎంపిపి భర్త లుముంబ, ఎంపిటిసి నామాల శ్రీను, వైసిపి నాయకులు మధుసుదన్‌రెడ్డి, మాజీ సచివాలయ కన్వీనర్లు వాల్మీకి రాఘవేంద్ర, చెప ఈరన్న, వెంకటరాముడు, నాగరాజు, యేసేపు నాగన్న, లింగన్న, తిమ్మప్ప, గ్రామస్తులు దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో ఇతర గ్రామాల నుండి పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. దాదాపు లక్షమంది పాల్గొన్నట్లు సర్పంచ్ అరుణ్‌కుమార్ తెలిపారు.

## క్రికెట్ మ్యాచ్‌లో మూగలదొడ్డి టీమ్ గెలుపు..

మూగలదొడ్డి(కోసిగి), జూలై 28, ప్రభాతవార్త

మొహర్రం పండుగను పునస్కరించుకుని మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలలో మూగలదొడ్డి టీమ్ ప్రథమంగా నిలిచి విజయకేతనం ఎగరవేసింది.. శుక్రవారం కామనదొడ్డి, మూగలదొడ్డి టీమ్‌ల మధ్య హోరాహోరిగా జరిగిన ఈ క్రికెట్ మ్యాచ్‌లో మూగలదొడ్డి టీమ్ గెలుపొందింది.. గత 14వ తేది నుండి ప్రారంభమైన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలలో సుమారు 16 టీమ్‌లు పాల్గొన్నాయి.. ఇందులో రెండు టీమ్‌లు మాత్రమే విజయం సాధించాయి.. ప్రథమంగా గెలుపొందిన మూగలదొడ్డి టీమ్‌కు గ్రామ సర్పంచ్ శివలింగమ్మ, వైకాపా నాయకుడు సోమేష్‌లు రూ.15వేలు నగదును బహుమతిగా అందించారు. అలాగే ద్వితీయ స్థానంలో నిలిచిన కామనదొడ్డి టీమ్‌కు ఉపసర్పంచ్ రమేష్ రూ.10 వేల నగదును విజేతలకు అందించారు.. అలాగే మొహర్రం పండుగను గ్రామంలోని కులమతాలకు అతీతంగా జరుపుకుంటున్నట్లు వారు తెలిపారు.. ముఖ్యంగా గ్రామంలో వీధిలైట్లు, గ్రామ రహదారులు సర్పంచ్ ఆధ్వర్యంలో పూర్తి చేసారు.. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..

## దేవాలయ ప్రహరిగోడను కూల్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి



**కర్నూలు విద్య, జూలై 28, ప్రభాతవార్తః** కర్నూలు నగరంలోని ఎల్‌బిజి నగర్, కెసి కెనాల్ రోడ్డు శ్రీశ్రీశ్రీ కాళీ మాత దేవాలయం గత 30 సంవత్సరాలుగా నిత్యం దూప దీప నైవేద్యాలతో భక్తులు కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్నది. ఈతెల్లవారుజామున అధికారులు ప్రహరిగోడను కూల్చడానికి 100 మంది సిబ్బంది అధికారులు భక్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. ఈచర్యను ఖండిస్తు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణా పేర్కొన్నారు. హిందూ దేవాలయాలపై చులకన భావనతో వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హిందూ దేవాలయాలపైన నిర్లక్ష్యం వహిస్తే సహించమని భజరంగదళ్ రాష్ట్ర కన్వీనర్ టి ప్రతాపరెడ్డి అన్నారు. బిజెపి రాష్ట్ర నాయకులు కె హరిబాబు, దేవాలయాలపై దాడిచేసే ముందు అటువైపు వున్న మార్గంలో దాదాపు 10 చర్చీలు కూలాల్చలన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు విహెచ్‌పి నగర కార్యదర్శి ఈపూరి నాగరాజు, జెపి జయప్రకాష్‌సింగ్, శేఖర్, ఈశ్వర్, రాహుల్‌సింగ్, నారాయణసింగ్, దేవాలయ కమిటీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకులు తలుచుకుంటే రాజకీయ చరిత్రను మార్చగలరు

– నంద్యాల్లో వాల్మీకుల పోరుబాట

**నంద్యాల విద్య, జూలై 28, ప్రభాతవార్తః** రాష్ట్రంలో వాల్మీకులు, బోయలు తలుచుకుంటే రాజకీయ చరిత్రను మార్చగల శక్తి సామర్థ్యాలు ఉన్నాయని రాబోయే కాలంలో టిడిపి పార్టీని బలపరిచి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబును కూర్చోబెట్టెందుకు ఐక్యమత్యంతో పోరాటం సాగిస్తామని వాల్మీకి బోయ సాధికారక కమిటీ జిల్లా అధ్యక్షులు బోయ రామకృష్ణ, రాష్ట్ర బిసి సెల్ అధ్యక్షులు గోవిందనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల మండలం చాబోలు గ్రామంలో తలారి రామచంద్రుడు అధ్వర్యంలో వాల్మీకుల ఐక్యతా సమావేశం నిర్వహించారు. టిడిపి పార్టీ జిల్లా కార్యదర్శి బోయ ధనుంజయ, చాబోలు నాయుడు, ఆశోక్, వాల్మీకి నాయకులు మండ్ల గుర్రప్ప , శివనాగరాజు, పివి రమణ, ఆర్‌ఎంపి శివ, దేవనగర్ వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు. నంద్యాల జిల్లాలో రాష్ట్ర అధ్యక్షులు పూల నాగరాజు ఆదేశాల మేరకు పొలిట్‌బ్యూరో అధ్యక్షులు ఎమ్మెల్సీ ఎన్‌ఎండి ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, టిడిపి అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండి ఫిరోజ్ ఆశీర్వాదంతో సాధికారిక కమిటీ సమావేశం నిర్వహించారు. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని అందరి సహకారంతో 2014లో టిడిపి ప్రభుత్వం చంద్రబాబు నాయుడుఅధ్వర్యంలో చిత్తశుద్ధితో వాల్మీకి ఎస్టీ అంశంపై తీర్మానం చేసి చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా కేంద్రానికి పంపడం జరిగిందనా న్నరు. వాల్మీకుల దోహ్రి జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. టిడిపి మేనిఫోస్టో వల్ల మహిళల్లో అదరణ పెరిగిందన్నారు. యువగళం రథసారధి లోకేష్‌బాబు ఇచ్చిన మాట ప్రకారం వాల్మీకులందరు టిడిపి వైపు ఉన్నారని పిలుపు నిచ్చారు. రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని ఏకగ్రీవంగా తీర్మాణం

## చెట్లు నాటడం సామాజిక బాధ్యతగా భావించాలి

– ఎంపిపి బుగ్గన నాగభూషణంరెడ్డి

**బేతంచెర్ల, జూలై28, ప్రభాతవార్త:** ఆధునిక యుగంలో విలాసవంతమైన జీవితం గడిపేందుకు వాడుతున్నా వివిధ యంత్రాలు, వాహనాల ద్వారా, పరి శ్రమల ద్వారా వెలువడుతున్న వ్యర్థాలతో రోజు రోజుకు ప్రాణవాయువు తగ్గుతుందని దీనిని అరికట్టేందుకు మొక్కలు నాటడం ఒక్కటే మార్గమని ఇది ప్రతిఒక్కరు సామాజిక బాధ్యతగా భావించాలని ఎంపిపి బుగ్గన నాగభూషణంరెడ్డి అన్నారు. శుక్రవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ చేపట్టిన రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమంలో వైసీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, మర్తుజావలి, నాగరాజులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని హెచ్ కొట్టాల నుండి ముచ్చట్ల మల్లికార్జునస్వామి క్షేత్రం వరకు, కొలుములపల్లె నుండి బుగ్గానిపల్లె వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని అధికారులతో కలిసి వారు ప్రారంభించారు. దాదాపు 20కిలోమీటర్ల ఈ రోడ్లకు ఇరువైపులా 8వేల మొక్కలు నాటాలని అంచనావేసినట్లు అధికారులు వారికి తెలిపారు. వీటిని రక్షించడంలో ఆయా గ్రామాల ప్రజలు సామాజిక బాధ్యతగా వ్యవహరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో శేషన్న, ఇతర అధికారులు, వైసీపీ నాయకులు తిరుమలేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు వెంకటలక్ష్మమ్మ, వెంకటేశ్వర్లు, చిన్నమద్దమ్మ, అంబుడ్స్‌పర్సన్ సురేంద్ర కుమార్, ఎంపిడివో వెంగన్న, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర పథకాలను కూడా వైసిపి తన ఖాతాజమ

**కోవెలకుంట్ల, జూలై 28, ప్రభాతవార్త :** కేంద్రములో అధికారములో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న వివిద పథకాలకు కూడా వైసిపి ప్రభుత్వం తమ పథకాలుగా చెప్పుకుంటుదని జిల్లా బిజెపి ప్రదాన కార్యదర్శి చాందినీ అరోపించారు. శుక్రవారము అమె విలేకర్లతో మాట్లాడుతూ మన ప్రదాని నరేంద్ర మోడి విజన్ ఉన్న నాయకుడు అన్నారు. ముఖ్యంగా దేశము ఈ నాడు ఇతర దేశాలతో పోటీ పడి గర్వంగా నిలబడుతుందంటే అది ఒక్క మోడీ వల్లనే సాధ్యము అయిందని అమె చెప్పారు. అయితే రాష్ట్రంలో ఉన్న వైసిపి ప్రభుత్వం అప్పుల ఊబిలో ఇరుక్కు పోయిందని చెప్పారు. ఇటీవల కేంద్రము పేదలకు అందించిన ఉచిత బియ్యము, రాగులు, గొన్నలను కూడా తామే రేషన్ కార్డుదారులకు ఉచితంగా అందిస్తున్నామని ప్రచారము చేసుకోవడము ఎంతో శోచనీయమన్నారు. ప్రజలకు ఒక్క రూపాయకు అందించే కోట ఎక్కడి పోయిందని అమె ప్రశ్నించారు. అలాగే కేంద్రము రైతులకు అందిస్తున్న కిసాన్ యోజన పథకము కింద అందించే డబ్బులను కూడా వారి ఖాతాలో వేసుకుంటున్నారని అరోపించారు. అలాగే రైతుల కోసం రాయితీతో ఎరువులను అందిస్తున్నదని చెప్పారు. ఏటా కోట్లు ఖర్చుచేసి రైతులను అదుకుంటున్న దానిని ఇక్కడ ప్రభుత్వం ప్రచారము చేయడము లేదన్నారు. ఇలాంటివి ఒక్కటి కాదు చాలా పథకాలు వారి ఖాతాలో జమ చేసుకుంటున్నారని అమె అరోపించారు. రాష్ట్రానికి నూతన అధ్యక్షురాలుగా దగ్గుపాటి పునందేశ్వరీ బాధ్యతలు తీసుకుని రంగంలోకి దిగారు ఇక ఇక్కడి వారి అటలు సాగవని చెప్పారు.

## రైతులకు అవసరమైన సేవలను అందించాలి

**ప్యాపిలి జూలై28(ప్రభాతవార్త):** రైతులకు అవసరమైన సేవలను సకాలంలో అందించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వి.భరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్యాపిలి పట్టణంలోని రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం పగటిపూట ఉచితంగా తొమ్మిది గంటల పాటు కరెంటు ప్రభుత్వం అందిస్తున్నదని గుర్తు చేశారు. రాయితీలు, సబ్సిడిలతో విత్తనాలు, తుంపర్లు, బిందు సేద్య పరికరాలను అందిస్తున్నారని వివరించారు. వెయ్యి కోట్ల రూపాయల నిదులతో గ్రామాలలో రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు మండల కేంద్రాలకు రాకుండ గ్రామాలలోనే ప్రతిశాఖ అధికారులను నియమించి ప్రభుత్వ సేవలను అందిస్తున్న ఘనత వైకాపా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పంటలను నష్టపోయిన సీజన్‌లోనే నష్టపరిహారం అందిస్తున్నదని, పంటల భీమాకు ప్రభుత్వమే పూర్తి స్థాయిలో భీమా డబ్బులను చెల్లిస్తున్నదని తెలిపారు. ఎరువులు, విత్తనాల వ్యాపారుల చేతిలో మోసపోకుండ ఉండటం కోసం రైతులకు రైతుభరోసా కేంద్రాల ద్వార విత్తనాలు, ఎరువులను అందిస్తున్నదని ప్రకటించారు. అనంతరం కౌలు రైతులకు కౌలు పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బోరెడ్డి శ్రీరామ్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి దిలీప్‌చక్రవర్తి, డోన్ మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు మెట్టుపల్లె వెంకటేశ్వరరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బోరెడ్డి రామచంద్రారెడ్డి, నాయకులు రాజా మురళిక్రిష్ణ, ఏడిఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి, పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు రమణమూర్తి, తాహసిల్దార్ చంద్రశేఖర్‌వర్మ, ఏవో రాజేష్, ఉద్యానవనశాఖ అధికారిణి కళ్యాణి, ఏపివో, వ్యవసాయ సలహామండలి సభ్యులు, రైతుభరోసా కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్ ఎదుట నల్లబ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగులు,కార్మికుల నిరసన

**బేతంచెర్ల, జూలై28, ప్రభాతవార్త:** విద్యుత్ శాఖలో ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం బేతంచెర్ల విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి సబ్‌స్టేషన్‌లో నిరసన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించడంతోపాటు కాం ట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని అలాగే అన్ని రకాల సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, పర్మినెంట్ ఉద్యోగులు సురేష్‌బాబు, నిరంజన్‌బాబు, మస్తాన్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, కాంట్రాక్టు కార్మికులు సుబ్బయ్య, గిరి కుమార్, ఆశిష్, ఆంజనేయులు, ఎనర్జీ అసిస్టెంట్స్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## జగనన్న సురక్షను సద్వినియోగము చేసుకోండి

**సౌదరదిన్నె(కోవెలకుంట్ల), జూలై 28, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను అక్కడిక్కడే పరిస్కరించడానికి ఏర్పాటు చేసిన జగనన్న సురక్షను సద్వినియోగము చేసుకోవాలని తహశీలుదారు పుష్పకుమారి కోరారు. జగనన్న సురక్షలో బాగంగా శుక్రవారము మండలంలోని సౌదరదిన్నె గ్రామంలో సర్పంచు మదుసూదనరెడ్డి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమము నిర్వహించారు. ఇందులో యంపిడిఓ రాదిక, తహశీలుదారు పుష్పకుమారి పాల్గొని ప్రసంగించారు. వీరితో పాటు అన్నిశాఖల అదికారులు పాల్గొన్నారు.

## విచ్చలవిడిగా గ్లైసిల్ గడ్డి మందు అమ్మకాలు

**చాగలమర్రి, జూలై28, ప్రభాతవార్త:** చాగలమర్రి మండల పరిధిలోని ముత్యాలపాడు గ్రామంలో గడ్డిమందు(గ్లైసిల్) అమ్మకాలు జోరుగా సాగుతున్నప్పటికి సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వివరాల మేరకు చాగలమర్రి మండలంలోని డీవనిపెంట తదితర గ్రామాల్లో గడ్డి పొలాలు ఎక్కువగా ఉండడం వల్ల గ్లైసిల్ స్ప్రే చేసేందుకు మొగ్గు చూపుతుండడంతో దాన్ని ఆసరాగా తీసుకున్న ముత్యాలపాడు గ్రామంలో మందుల వ్యాపారస్తుడు ప్రభుత్వం నిషేధిత గడ్డి మందు గ్లైసిల్‌ను తీసుకువచ్చి అమ్ముతుండడం గమనార్హం. గడ్డి మందు పిచికారి చేయడం వల్ల భూమిలో అవశేషాలు తగ్గిపోవడం జరుగుతుందని వాటి వాకడం నిలిపివేయాలనే ఆదేశాలు ఉన్నప్పటికి దుకాణదారుడు రహస్యంగా కొనుగోలుచేసి రైతులకు అమ్మకాలు జరుపుతున్న వైనం ముత్యాలపాడు గ్రామంలో చోటు చేసుకుందని పలువురు తెలుపుతున్నారు. 20లీటర్ల గ్లైసిల్ మందు రూ.12వేల చొప్పున రైతులు కొనుగోలు చేయడం జరుగుతుంది. అధికారులు దుకాణాల మీద ఎన్నిసార్లు దాడులు నిర్వహిస్తున్నప్పటికి ప్రభుత్వం అనుమతిలేని మందులు, బిల్లులు లేని మందు, రెండవ రకం మందులు నిత్యం అమ్మకాలు జరుపుతున్నా కూడా అధికారులకు కనిపించకపోవడం అంతర్యామేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ నిషేధిత మందులు, జీరో నిషేధిత మందులను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

## ఉధృతమైన మిషన్ రాయలసీమ ప్రచారం

**మద్దికెర, జూలై 28, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మద్దికెరలో వీధివీధిలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ నాయకులు మిషన్ రాయలసీమ ప్రచారాన్ని ఉధృతం చేశారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి రాజన్న, తెలుగు యువత అధ్యక్షులు చంద్రశేఖర్‌గౌడ్‌లు మాట్లాడుతూ రాయలసీమలో లోకేష్ పాదయాత్ర చేసి ఇక్కడ ఉన్నటువంటి సమస్యలను ప్రధానంగా కేంద్రీకరించి రాయలసీమ అభివృద్ధి కొరకు జిల్లాల వారిగా అభివృద్ధి చేసేందుకు తెదేపా పార్టీ కంకనం కట్టుకుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తుందని ప్రజల కోసం పనిచేసేది నారా చంద్రబాబునాయుడు, కెఈ శ్యాంబాబులు మాత్రమేనన్నారు.

## వెల్దుర్తిలో ఘనంగా పెద్దసరిగెత్తు వేడుకలు

– నేడు ఏటికి వెళ్లనున్న పీర్లు..– భక్తులకు అన్నదానం ఏర్పాటు..



**వెల్దుర్తి, జూలై28, ప్రభాతవార్త :** మండలంలోని వెల్దుర్తి, రామళ్లకోట, కలుగోట్ల, పుల్లగుమ్మి, బోగోలు, సూదేపల్లి, నర్సాపురం, క్రిష్ణాపురం, నార్లాపురం, అల్లుగుండు గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లో మొహర్రం పండుగను పురస్కరించుకొని పీర్లస్వాములను ప్రతిష్టించారు. కులమతాలకు అతీతంగా జరపుకునే పండుగలలో ఒకటైన మొహర్రం పండుగ సందర్భంగా భక్తులు శుక్రవారం వెల్దుర్తిలోని పెద్దమసీజిద్ వద్ద గల పీర్ల చావిడిలో మౌలాలిస్వామి, భారీ ఇమామ్, మహబూబ్‌సుభాని దర్గాలో దస్తగిరిస్వామి, ముల్లవీధిలోని లాల్‌సా, కొలంబావి వీధిలోని పెనుకొండ బాబాయి(బాబా ఫక్రుద్దీన్), ఈడిగవీధిలో హసన్‌హుసేన్, తెలుగు వీధిలోమరొక చోట ఏర్పాటుచేసిన పీర్లచావిడులలో పీర్లస్వాములు భక్తులచే ఫాతేహాః అందుకున్నారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పెద్దసరిగెత్తు కావడంతో భక్తులు అత్యధిక సంఖ్యలో హాజరై పీర్లచావిడిలకు చేరుకొని తమ మొక్కు తీర్చుకున్నారు. వెల్దుర్తిలోని పెద్దమసీజిద్ పీర్లచావిడి వద్ద గోనెసంచుల కోట్రా భాస్కర్‌శెట్టి, చంద్రకాంత్, తారక్, లాల్‌సా పీర్లచావిడి వద్ద పాత్రికేయుడు రాజు భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. అనంతరం భక్తులకు వారు షర్‌బత్‌ను పంచి పెట్టారు. ముందుగా వారు కుటుంబసభ్యులతో కలిసి పీర్లస్వాములను దర్శించుకొని ఫాతేహా చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శనివారం పీర్లు ఏటికి వెళ్తాయని దీంతో మొహర్రం ముగుస్తుందన్నారు. పండుగకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా వెల్దుర్తి సిఐ యుగంధర్ ఆధ్వర్యంలో వెల్దుర్తి ఎస్సై పి.చంద్రశేఖర్‌రెడ్డి గట్టి పోలీస్ బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈ వేడుకల్లో ఆకతాయిలు అల్లర్లకు పాల్పడడం, మహిళలను వేధించడం, ద్విచక్రవాహనాల్లో చక్కర్లు కొట్టడం, వేడుకల పేరుతో ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే తమదైన శైలిలో ట్రీట్‌మెంట్‌తో పాటు కేసులు నమోదు చేస్తామని ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డి ఈ సందర్భంగా హెచ్చరించారు. ఆకతాయిలపై ప్రత్యేక పోలీస్ నిఘా ఉంచామన్నారు.

## రోగులకు అందుబాటులో వైద్యసేవలు అందిస్తున్నాం

వెల్దుర్తి, జూలై28, ప్రభాతవార్త

రోగులకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తున్నామని వెల్దుర్తి సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్. బాలచంద్రారెడ్డి అన్నారు. స్థానిక సిహెచ్‌సిలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా దోమతెరలు వాడాలన్నారు. ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లో మురికినీరు నిల్వఉండకుండా, ఇళ్లలోని నీటి తొట్టీలలో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు పెరిగి అవి కుట్టడం వల్ల జ్వరాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. త్రాగేనీటిని కాచి చలార్చి వడబోసి త్రాగాలన్నారు. ఎవరికైనా డెంగ్యూ వంటి జ్వరాలు వస్తే సిహెచ్‌సికి రావాలని తమ వద్ద అందుబాటులో మందులు ఉన్నాయన్నారు. క్షయవ్యాధికి, కుక్కకాటుకు మందులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. రోగులకు అన్నిరకాల వైద్యపరీక్షలు చేయిస్తున్నామన్నారు. ఈసిజీ మిషన్ సైతం వచ్చిందన్నారు. గర్భవతులకు సంబంధించిన వైద్యసదుపాయాలు ఉన్నాయన్నారు. విషపూరితమైన పాముకాటుకు మందులు చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. వైద్యశాలకు వచ్చిన రోగులకు వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. వారికి అత్యవసరసేవలు అవసరమైతే 108 అంబులెన్స్‌లో కర్నూలుకు తరలిస్తున్నామన్నారు. పిహెచ్‌సిగా ఉన్న ఈ వైద్యశాలను రూ.6కోట్ల రుపాయలు వెచ్చించి ప్రభుత్వం సిహెచ్‌సి వైద్యశాల చేసిందన్నారు. మండలంలోని గ్రామాల్లో ఉన్న పిహెచ్‌సి వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు ఎవరికైనా జబ్బు చేస్తే సిహెచ్‌సికి పంపాలని సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్. బాలచంద్రారెడ్డి కోరారు. అందుబాటులో ఉండి 24 గంటల పాటు వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. రోగులు ఈ వైద్యసేవలు వినియోగించుకోవాలన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం



**పత్తికొండ, జూలై28, ప్రభాతవార్త:** పత్తికొండ పట్టణంలో పాత ఎస్టీ హాస్టల్ సమీపంలో విద్యుత్ అధికారులు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు పేర్కొంటున్నారు. కాలనీ గుండా వెలుతున్న విద్యుత్ వైర్లు పైకి లేకుండా కిందికి ఉండి మనిషికి అందే ఎత్తులో ఉన్నాయని ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రమాదంలో ప్రాణనష్టం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని కాలనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ తీగలు కిందికి ఉండడంతో తామే కట్టెల సహాయంతో విద్యుత్ తీగలు పైకి ఉండేలా ఏర్పాటు చేసుకున్నట్లు కొందరు కాలనీవాసులు పేర్కొంటున్నారు. కాలనీలో తీగలు పైకి ఉండేలా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితంలేదని కాలనీ ప్రజలు పేర్కొంటున్నారు. అలాగే ఈ విషయమై స్పందన కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికి ప్రయోజనం లేకుండాపోయిందని వారు వాపోయారు. అధికారులు ఏ ప్రమాదం జరగక ముందే స్పందించి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి ప్రమాదం జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## ఓఆర్‌ఎస్ ద్రావణం గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలి

**ఆదోనిటౌన్, జూలై28, ప్రభాతవార్త ;** ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓఆర్‌ఎస్ వారోత్సవాలను స్థానిక ప్రయివేట్ ఆస్పత్రిలో డాక్టర్లు రఘునాథ్, సూర్‌దాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఓరల్ రీ-హైడ్రేషన్ థెరపీ ఏర్పడినప్పుడు మనిషి ఒంట్లో నీరు తగ్గిపోయినప్పుడు వాంతులు, విరోచనలు అవుతాయన్నారు. ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని చిన్న పిల్లలకు ఏవిధంగా తాపాలి, ఎలా నీటిలో కలపాలి, , వాటిలోని రకాలు, మార్కెట్‌లో ఎలా దొరుకుతున్నాయి. వాటిని ఇంట్లోనే ఎలా చేసుకోవచ్చు అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఓఆర్‌ఎస్ ద్రావణం ఎలా పట్టించాలి, ఎన్ని రోజులకు పట్టించాలనే విషయాలను వివరించారు. ఈ సదస్సులో డాక్టర్లు హరీష్, గోపీనాథ్, ఆదిత్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## తన ఎంపికకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు

**ఆదోనిటౌన్, జూలై28, ప్రభాతవార్త ;** ఆంధ్రప్రదేశ్ ఆపన్నప్రదీపన బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులుగా తనను ఎన్నుకునన ందుకు రాష్ట్రంలో ఉన్న బ్రాహ్మణ పెద్దలకు, స్థానిక ఎమ్మెల్యేకు వైసీపీ జిల్లా నాయకుడు మధుసూదన్‌శర్మ కృతజ్ఞతలు తెలియజేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న పేద బ్రాహ్మణ అర్చకుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టకి తీసుకెళ్లి పరిష్కారదిశగా పనిచేస్తానని చెప్పారు. ఇప్పటికే కొన్ని పల్లె ప్రాంతాల్లో ఉన్న ఆలయాలకు కొన్నింటికీ ధూపదీప నైవేద్యాలు లేని ఆలయాలను పట్టణ ప్రాంతాల్లో ధూపదీప నైవేద్య స్కీమ్‌ను అమలుపరిచేవిధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానన్నారు. అలాగే చిన్నచిన్న దేవస్థానాల్లో పనిచేసే అర్చకులకు, చిన్నచిన్న ప్రయివేట్ ఉద్యోగాలు చేసుకునే బ్రాహ్మణులను గుర్తించి వారికి ఆరోగ్య కార్డులు, ప్రభుత్వ గృహాలు, మొదలైన సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేస్తానని చెప్పారు. ఈనెల 23వ తేదీన కర్నూలులో జరిగిన అధ్యక్షుడి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆదోని వైసీపీ యువనేత వై.జయమనోజ్‌రెడ్డి, ఏపీ రాష్ట్ర దేవదాయ ధర్మదాయశాఖ ప్రభుత్వ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్, రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసిన బ్రాహ్మణులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## మణిపూర్ ఘటన పై ప్రధాన మంత్రి స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది

– ఏఐటీయుసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివబాలకృష్ణ

**బనగానపల్లె, జూలై28, ప్రభాతవార్త:** మణిపూర్ ఘటన జరిగి మూడు నెలలు అవుతున్నా దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఏఐటీయుసీ నంద్యాల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శివబాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం బనగానపల్లె నియోజకవర్గ పరిధిలోని అవుకులో మండలశాఖ ఏఐటీయుసీ అధ్యక్షులు నాగాంజనేయులు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న శివబాలకృష్ణ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలు, క్రైస్తవుల పై ఇటువంటి ఘాతుకాలు జరుగుతున్న వాటి పై విచారణ లేదన్నారు. మణిపూర్ ఘటనకు బాధ్యులైన నిందితులను విచారణ లేకుండా ఉరిశిక్ష విధించాలని ఆయన డిమాండ్ చేశారు. పార్లమెంట్ మణిపూర్ ఘటన పై ప్రతిపక్షాలు మాట్లాడకుండా అడ్డుపడుతూ బీజేపీ దుర్మార్గమైన చర్యకు పాల్పడుతుందని ఆయన విమర్శించారు. ఈ నిరసన ర్యాలీలో ఏఐటీయుసీ నంద్యాల పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, బనగానపల్లె మండల కార్యదర్శి కుళాయిస్వామి, అవుకు మండల అధ్యక్షురాలు మేరీ, రవి, విజయ్, హుస్సేన్, చిన్నమ్మ, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కుబడులు తీర్చుకున్న మంత్రి జయరాం,ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



**హొలహర్వి,జూలై 28,ప్రభాతవార్త :** మొహరం వేడుకల సందర్భంగా మండలంలోని కామినహాల్ గ్రామంలో శుక్రవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మొక్కుబడి తీర్చుకున్నారు. తులాభారం నిర్వహించి పీర్ల దేవుళ్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మంత్రి జయరాంకు ప్రత్యేకంగా ఆహ్వానం పలికి పూలమాల వేసి సన్మానం చేశారు. అనంతరం మంత్రి జయరాంకు తులాభారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ రైతులు,ప్రజలు,సుఖ సంతోషాలతో ఉండాలని,సమృద్ధిగా వర్షాలు కురిసి మంచి పంటలు పండాలని దేవున్ని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రతిఒక్కరు ఆధ్యాత్మిక భావాలు అలవరచుకోవాలని కోరారు. దైవభక్తి కలిగి ఉంటే ప్రతిఒక్కరికి మనశ్శాంతి లభిస్తుందన్నారు. బడుగు,బలహీన వర్గాల అభివృద్ధి కోసం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లో భాగంగా అమ్మఒడి,రైతుభరోసా, వైఎస్సార్ చేయూత,ఆసరా తదితర సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98శాతం అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక టిడిపి నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. టిడిపి పార్టీపై ప్రజలు పూర్తిగా నమ్మకం కోల్పోయారని ఆయన తెలిపారు. టిడిపి నేత చంద్రబాబునాయుడు ఎన్నికయుక్తులు చేసినా ప్రజలు నమ్మరని ఆయన తెలిపారు. 2024ఎన్నికల్లో వైసిపి 175స్థానాల్లో విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కామినహాల్ గ్రామంలో జరిగిన మొహరం వేడుకల్లో తులాభారం నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామినహాల్ సర్పంచ్ పద్మావతి,వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొనంకి జనార్థన్‌నాయుడు, జడ్‌పిటిసి సభ్యులు లింగప్ప,చింతకుంట సొసైటీ చైర్మన్ శ్రీనివాసులు,వైసిపి మండల కన్వినర్లు భీమప్పచౌదరి,వీరేష్,వైసిపి నాయకులు బాపురం మాజీ సర్పంచ్ నాగేంద్ర,బజారప్ప,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మహా పడావో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



**ఆదోని,జూలై 28,ప్రభాతవార్త :** ఆగస్టు 9వ తేదీన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ మోడీ-సేవ్ ఇండియా అనే నినాదంతో విజయవాడలో జరుగు మహా పడావో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు,ఐఎన్‌టియుసి దేవిశెట్టి ప్రకాష్,సిఐటియు పట్టణ అధ్యక్షులు తిప్పన్న,ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఎంకప్ప,నాయకులు చెన్నకేశవులు అన్నారు. శుక్రవారం కేంద్ర కార్మిక సంఘాల సమావేశం సిఐటియు పట్టణ కార్యదర్శి పిఎస్ గోపాల్ అధ్యక్షతన సుందరయ్య భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మిక,కర్షకుల పట్ల అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున కార్మికులను సమీకరించి ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనా న్నరు. కార్మికులు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 44కార్మిక చట్టాలను 4కోడ్‌లుగా కుదించి కార్మికులకు ఎటువంటి హక్కులు లేకుండ చేసి కార్పొరేట్ కంపెనీలకు కట్టుబానిసలుగా చేయాలని చూస్తుందన్నారు. మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్రంలో ఉన్న జగన్ ప్రభుత్వం వాటిని బలపరుస్తూ కార్మిక ఉద్యమాలను పోలీసుల ద్వారా అణిచివేయాలని చూస్తుందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 9వ తేదీన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ మోడీ-సేవ్ ఇండియా అనే నినాదంతో విజయవాడలో జరుగు మహా పడావో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు ఎంకన్న,నాయకులు భీమేష్,హుసేని,సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మన్న,ఐఎఫ్‌టియు నాయకులు నాగరాజు తదితరులున్నారు.

## విదేశీ విద్యా పథకంలో విద్యార్థులను తగ్గించడమే వైసిపి లక్ష్యం

**ఆస్పరి,జూలై 28,ప్రభాతవార్త :** విదేశీ విద్యాదీవెన పథకం అమలు తీరు అంతా లబ్దిదారుల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం అమలు చేస్తుందని టిడిపి యువ నాయకులు సతీష్‌కుమార్,మహేష్‌లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ఆస్పరిలో స్థానిక గాంధీపార్కు ఆవరణలో యూత్ కన్వినర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత చదువులు చదవాలనుకునే ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సాయం అందించాలన్నదే విదేశీ విద్యాదీవెన పథకం లక్ష్యంతో గత టిడిపి ప్రభుత్వంలో అమలైన ఈ పథకాన్ని వైసిపి అధికారంలోకి రాగానే అటకెక్కించిందన్నారు. క్షేత్రస్థాయిలో ఆందోళనలతో ఇటీవలే జగనన్న విదేశీ విద్యాదీవెన పేరుతో పునరుద్దరించిందని అయితే నిబంధనలు మరింత కఠినతరం చేయడంతో పాటు విద్యార్థులకు సరిగా అవగాహన కల్పించకపోవడంతో చాలామంది పథకానికి దూరమయ్యారన్నారు. మొదట 200క్యూఎస్ ర్యాంకింగ్ కలిగిన విదేశీ యూనివర్సిటీల్లో సీట్లు పొందిన విద్యార్థులకే ప్రభుత్వం విదేశీ విద్యసాయాన్ని అందిస్తుందని ప్రకటించారు. దీంతో చంద్రబాబు హయాంలో అమలైన పథకంతో పోలిస్తే లబ్దిదారుల సంఖ్య భారీగా తగ్గిపోయిందన్నారు. చంద్రబాబు హయాంలో 4,923మందికి ఈ పథకం ద్వారా ప్రయోజనం అందిస్తే,కేవలం 213మందికి అమలు చేసి చేతులు దులుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు యుగంధర్,అంజి,ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా పారా రాఘవేంద్ర



**మద్దికెర,జూలై 28,ప్రభాతవార్త :** మద్దికెర మండల కేంద్రానికి చెందిన పారా రాఘవేంద్రను ఏపి ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా అధ్యక్షునిగా నియమించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు సుందర్‌రాజ్ కమిటీ సభ్యులు నా మీద నమ్మకం ఉంచి ఈ పదవిని అప్పజెప్పినందుకు ప్రత్యేక ధన్యవాదాలు, మాదిగ జాతికి జిల్లాలో ఏ మూలనైనా అన్యాయం జరిగిన తక్షణమే స్పందించి వారికి న్యాయం చేస్తానని భవిష్యత్తులో చేపట్టబోయే వివిధ ఉద్యమ కార్యక్రమాలు విజయవంతంగా చేస్తానన్నారు. **హర్షం వ్యక్తం చేసిన కాలనీవాసులు :-** జిల్లాలోని సరిహద్దు ప్రాంతమైన మద్దికెరలో మాదిగ జాతి కులము కోసం పోరాడమని జిల్లా ఉన్నతస్థాయి పదవిని కట్టుపెట్టిన రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు మరియు జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన పారా రాఘవేంద్రని ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద్,రాముడు, నాగరాజు,సంజీవ,జగన్నాథ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## 'పంటల సాగులో మెలుకువలు పాటించాలి- ఏఒ జ్యోతి'

**కొలిమిగుండ్ల, జూలై 28, ప్రభాతవార్త :** పంటలు సాగు సమయంలో వ్యవసాయాధికారుల సూచనలతో ప్రత్యేక మెళుకువలు పాటించాలని కొలిమిగుండ్ల మండల వ్యవసాయ అధికారిణి బి.జ్యోతి పెర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దవెంతుర్ల గ్రామంలో వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కొండయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మినుము సాగులో యజమాన్య పద్దతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరోవైపు గ్రూపు ఏర్పాటు, రైతుల ఎన్నిక, ప్రాథమిక సర్వే నిర్వహణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ నాగరాజు, ఎంపిఇఒ మనోహర్ రైతులు పాల్గొన్నారు.

## బూత్ కమిటీలపై సమీక్ష సమావేశం



**కర్నూలు రూరల్,జూలై 28,ప్రభాతవార్త :** సి బెళగల్ మండలం బిజెపి నాయకులు,కార్యకర్తలు, అధ్యక్షులుగా ఎవరు నియమించబడాలి,బూత్‌లెవెల్ సభ్యులు ఎవరు ఉండాలి,పూర్తిగా కమిటీని ఎవరు ఎన్నుకోవాలి,పన్నా ప్రముఖ ఎవరు ఉండాలి అనే అంశాలపై శుక్రవారం కర్నూలు నగరంలోని రాష్ట్ర ఎస్‌సి మోర్చ ప్రధాన కార్యదర్శి మీసాల ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో తన కార్యాలయం నందు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్‌సి మోర్చ ప్రధాన కార్యదర్శి మీసాల ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ 9ఏళ్ల పాలనలో మన రాష్ట్రానికి చేసిన మేలును ప్రతిఇంటికి కరపత్రాలను బిజెపి కార్యకర్తలు పంచాలని సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు. ప్రతి అంశాన్ని ప్రతి పథకాన్ని వివరిస్తూ ఏఏవర్గాలు,ఏ లబ్దిపొందాయో ఇంటింటికి వెళ్లి వివరించాలని ఆయన అన్నారు. మన ప్రధాని మోడీ 9ఏళ్ల సేవా సుపరిపాలన,పేదల సంక్షేమం కోసం మన రాష్ట్రం,జిల్లాకు కేంద్రప్రభుత్వం సోలార్ ప్లాంట్,మెడికల్ కాలేజీలను,ఇరిగేషన్ ప్రాజెక్టులను మంజూరు చేశారో ప్రజలకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో సి బెళగల్ మండల అధ్యక్షుడు చిన్న దేవన్న,మండల మైనార్టీ మోర్చ నాయకులు మక్బూల్,శ్రీనివాసులు, మద్దిలేటి,పాండురంగడు,జానకిరాముడు,ఉమాశంకర్, వెంకటేశ్వర్లు, హరి,కొండలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి



**ఉయ్యాలవాడ, జూలై 28, ప్రభాతవార్త:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇంజేడు గ్రామంలో శీలం రామిరెడ్డి పొలంలో నిమ్మమొక్కలను నాటడం జరిగింది. సర్పంచ్ మేకల ఓబులేసు అధ్వర్యంలో మొక్కలు నాటించడం జరిగింది. అలాగే ఇంజేడు గ్రామ పంచాయితీ వద్ద పంచాయితీ సెక్రెటరీ అధ్వర్యంలో మొక్కలు నాటించడం జరిగిందనా న్నరు. పర్యావరణాన్ని కాపాడి పచ్చదనాన్ని పెంపొందించాలని ఈసందర్బంగా వక్తలు పేర్కొన్నారు. ప్రతిఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యాన్ని కాపాడాలని సర్పంచ్ ఓబులేసు, ఏపీఓలు కోరారు. ఈసందర బ్ంగా వారు ఉయ్యాలవాడ గ్రామంలోని గొల్లదారి సుబ్బనారాయణమ్మ పొలంలో మొక్కలు నాటించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రవిప్రకాష్, సర్పంచ్ మేకల ఓబులేసు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీయు జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయండి

**కర్నూలు విద్య, జూలై 28, ప్రభాతవార్త:** రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కర్నూలు జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం ఆదివారం ఉదయం స్థానిక సలాం ఖాన్ ఎస్టీయు భవన్‌లో జరుగుతుందని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ గోకారి, టికె జనార్ధన్‌లు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్ సాయి శ్రీనివాస్, హెచ్ తిమ్మన్న, ఆర్థిక కార్యదర్శి ప్రసాద్,కన్వీనర్ గాజుల నాగేశ్వర్‌రావు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల అనంతరం ఏర్పడిన సమస్యలపైన, విద్యా ఉపాధ్యాయ రంగ సమస్యలపై, 12వ పిఆర్సీ పై, వ ర్తోత్స వాల నిర్వహణపైన సంఘ నిర్మాణం పై చర్చ జరుగుతుందని తెలిపారు. ఎస్టీయు రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు మండల, పురపాలక, నగర పాలక అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## వైభవంగా పెద్దసెరిగేసు వేడుకలు

**ఆలూరు రూరల్,జూలై 28,ప్రభాతవార్త :** మండల పరిధిలోని హత్తిబెళగల్ గ్రామంలో మొహరం పండుగ సందర్బంగా పెద్దసెరిగేసు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో మొత్తం ఐదుచోట్ల పీర్లదేవుళ్లు కొలువుదీరినట్లు పూజారులు మదర్‌వలి,కలందర్‌లు తెలిపారు. గ్రామంలో పెద్దమసీదు వద్ద పీర్లచావడిలో కొలువుదీరిన పీర్లదేవుళ్లకు భక్తులు చక్కెర చదివింపులు,ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం అర్థరాత్రి అలాయ్ గుంత వద్ద నిప్పులు వేసి అలాయ్ ఆడనున్నట్లు పూజారులు తెలిపారు. అలాగే పీర్లదేవుళ్లను ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో మొహరం వేడుకలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు పూజారులు తెలిపారు. అదేవిధంగా మండల పరిధిలోని ముద్దనగేరి గ్రామంలో సర్పంచ్ సుధారెడ్డి మొహరం వేడుకల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మరకట్టు సర్పంచ్ ఎల్లప్ప మొహరం వేడుకల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పూజారి నూర్‌భాషా స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి అలాగే పెద్దసెరిగేసు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## కళాశాలల బంద్ విజయవంతం



**నందికొట్కూరు,జూలై 28,ప్రభాతవార్త:** జూనియర్ కళాశాలలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కారించాలని కోరుతు ఏబివిపి రాష్ట్ర వ్యాప్త జూనియర్ కళాశాలల బంద్ నందికొట్కూరులో విజయవంతమైంది. శుక్రవారం పట్టణంలోని కళాశాలలను ఏబివిపి నాయకులు బంద్ చేయించారు. ఈ సంధర్భంగా ఏబివిపి కళామంచి జిల్లా కన్వీనర్ నాగరాజు మాట్లాడుతు ప్రభుత్వ కళాశాలలలో విద్యార్థులకు మౌళిక వసతులు కల్పించాలని, 4వేలకు పైగా ఖాళీగా ఉన్న లెక్చరర్ల పోష్టులను భర్తీ చేయాలని, బ్రాండ్ల పేర్లతో విద్యను వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ తదితర కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, ఫీజు నియంత్రణ చట్టం ఏర్పాటు చేయాలని, అక్రమంగా వెలుస్తున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాథ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## రాంకొండ విఆర్‌ఓగా కాయల తలారి శ్రీనివాసులు



**తుగ్గలి,జూలై 28,ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాంకొండ విఆర్‌ఓగా కాయల తలారి శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో పగిడిరాయి విఆర్‌ఏగా పనిచేస్తూ విఆర్‌ఓగా పదోన్నతి పొంది ఆదోని మున్సిపాలిటీకి అధికారులు నియమించడం జరిగింది. అయితే ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆదోని మున్సిపాలిటీ విఆర్‌ఓగా పనిచేస్తున్న అతనిని రాంకొండ విఆర్‌ఓగా నియమించారు. ఈ సందర్భంగా విఆర్‌ఓ కాయల తలారి శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు,కార్యక్రమాలను అర్హులైన ప్రతిఒక్కరికి చేరువచేసి గ్రామాభివృద్ధికి పాటుపడతానన్నారు. అలాగే ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలకు పరిష్కారం చూపుతానన్నారు.

## బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు



**దేవనకొండ,జూలై 28,ప్రభాతవార్త :** మాజీ జిల్లా ఎస్పీ ఆకె రవికృష్ణ ఐపిఎస్ దత్తత గ్రామమైన కప్పట్రాళ్ల గ్రామంలో చింతమాను శివలింగప్ప ఇంటిదగ్గర సేట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బయోగ్యాస్ యూనిట్‌ను ప్రోగ్రాం మేనేజర్ బి నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేట్రీస్ సంస్థ వారు రూ.40వేలు విలువగల బయోగ్యాస్ ప్లాంట్‌ను ఉచితంగా శివలింగప్ప కుటుంబానికి మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ బయోగ్యాస్ ప్లాంట్ పశువుల పేడ ద్వారా గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తుందన్నారు. దీని ద్వారా కుటుంబంపై ఎల్‌పిజి గ్యాస్ యొక్క భారం పడకుండ పశువుల పేడతో ఇంటిదగ్గర వారే సొంతంగా గ్యాస్ తయారు చేసుకునేవిధంగా తయారు చేశామన్నారు. ప్రస్తుతం వాడుతున్న ఎల్‌పిజి గ్యాస్ ద్వారా అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని కావున ప్రజలు ఆరోగ్యం,ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బయోగ్యాస్ ప్లాంట్‌ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ బయోగ్యాస్‌లో ఉపయోగించినటువంటి పశువుల పేడను మరల గ్యాస్ ఉత్పత్తి అయిన తర్వాత ఈ ద్రవణాన్ని పండ్ల మొక్కల పెరుగుదలకు ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ చింతమాను రవికుమార్,గ్రామ సంఘం బుకింగ్ ఫర్ సుధాకర్,రైతు శివలింగప్ప,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులపై అధికారుల వత్తిడి తగదు



**నంద్యాల విద్య, జూలై 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉపాధ్యాయులపై అధికారుల వత్తిడి తగదని చీటికి మాటికి మెమోలు, సస్పెన్షన్లతో పాటు వత్తిడి భారాన్ని తగ్గించాలని రాష్ట్రంలో ఖాళీగా ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈపూరి వెంకట గోపాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల్లోని ఎస్టీయు భవన్‌లో రాష్ట్ర సహాధ్యక్షులు చంద్రశేఖర్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి అజాంబేగ్, మౌలాలి అధ్యక్షతన ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈసందర బ్ంగా నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వం 117 జిఓ ప్రకారం పదోన్నతులు కల్పించిన తరువాత ఇంక 3 వేల పోస్టులకు పైగా ఖాళీగా ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారని పేర్కొన్నారు. డిఎస్సీ ద్వారా భర్తీ చేయకుండా విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సుదూర ప్రాంతాలకు డిప్యూటేషన్ వేయడం దారుణమన్నారు. ఉపాధ్యాయుల సంఘం ఆగ్రహంతో రద్దుచేశారన్నారు. 3,4,5 తరగతుల విలీనంతో ప్రాథమిక విద్యావ్యవస్థ పతనం అయిందని ఈ జిఒను వెంటనే ఉప సంహరించాలని డిమాండ్ చేశారు. బదిలీ పొందిన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. పాఠశాలల్లో యాప్‌ల భారాన్ని తగ్గించి విద్య ప్రమాణాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సుబ్బయ్య, ప్రసాద్, బాలసుబ్బయ్య, నాగేంద్రకుమార్, దేవేంద్రనాయక్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి జగన్ రాయలసీమ దోహ్రి




**కర్నూలు న్యూసిటి, జూలై 28, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క జీఓతో సీమలోని 102 ప్రాజెక్టుల పనులను రద్దుచేశారని కోడుమూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జీ ఆకేపోగు ప్రభాకర్ వెల్లడించారు. శుక్రవారం జిల్లా టిడిపి పార్టీ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ ప్రాజెక్టుల కోసం టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.12,411 కోట్లు ఖర్చుచేస్తే వైసీపీ ఖర్చుచేసింది కేవలం రూ.2011 కోట్లు మాత్రమేనని తెలిపారు. రాయలసీమలో తీవ్ర నీటి ఎద్దడి తీర్చడానికి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత నేత నందమూరి తారక రామారావు తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీనీవా వంటి ప్రాజెక్టులను తీసుకువచ్చారని గుర్తుచేశారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం తెలుగుదేశం పార్టీ 2014-19లో రూ.68,293 వేల కోట్లు ఖర్చుచేస్తే, వైసీపీ ప్రభుత్వం కేవలం 22,165 కోట్లు మాత్రమే ఖర్చుచేశారని విమర్శించారు. రాయలసీమకు సాగునీటిని అందించే అతిముఖ్యమైన తెలుగుగంగ ప్రాజెక్టు నిర్మాణానికి టిడిపి ప్రభుత్వం 2014-19లో రూ.504 కోట్లు ఖర్చుచేస్తే జగన్ ప్రభుత్వం దీనిని పట్టించుకోకపోవడం విడ్డూరం అన్నారు. రాయలసీమ డ్రౌట్ మిటిగేషన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు క్రియేట్‌చేసి 23 ప్రాజెక్టులకు 35 వేల కోట్లకు టెండర్లు పిలిచారు. ఈవ్యవహారం అంతా పెద్ద గోప్యం దోపిడి. జగన్ ప్రభుత్వం 102 ప్రాజెక్టు పనులను ఆపేసి కాంట్రాక్టు సంస్థలకు బ్యాంకు గ్యారెంటీలు వెనక్కు ఇచ్చేశారన్నారు. కార్యక్రమంలో కర్నూలు మండల పార్టీ అధ్యక్షులు శివశంకర్‌నాయుడు, కోడుమూరు నియోజకవర్గ అధికారప్రతినిధి విజయ్‌కుమార్, కర్నూలు పార్లమెంటు అధికార ప్రతినిధి ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోండి

**పత్తికొండ,జూలై 28,ప్రభాతవార్త :** పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల నందు 6వ తరగతికి ఎస్‌టి క్యాటగిరిలో మరియు 8వ తరగతికి ఓసి క్యాటగిరిలో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ బి ఉమాకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలని 31న ఉదయం 9గంటలకు పాఠశాల చేరుకుని రాత పరీక్ష ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థినీలు దరఖాస్తు చేసేటప్పుడు స్టడీ,కుల,ఆధార్ జిరాక్స్‌లు జతపరచాలన్నారు.

## ఓటరు జాబితా పరిశీలన



**52-బసాపురం(మంత్రాలయం), జూలై 28,ప్రభాతవార్త:** మండల పరిధిలోని 52-బసాపురం గ్రామంలో జరుగుతున్న ఓటరు జాబితాను వైసిపి మండల కన్వీనర్ గుర్రెడ్డి భీంరెడ్డి శుక్రవారం పరిశీలించారు.గ్రామ విఆర్‌ఓ హరిత ఆధ్వర్యంలో జరగుతున్న ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రతి ఇంటికి వెళ్ళి ఓటరును తనిఖీ చేశారు.18 సం.లు నిండిన ప్రతి యువతీ,యువకులు తప్పకుండా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు.ఓటరు జాబితాలో ఏమయినా తప్పులు ఉంటే సరిచేయాలన్నారు.వీరివెంట బూత్ కన్వీనర్ నాగరాజు తదితరులు ఉన్నారు.

## వివిధ వేషాధారణలతో మొహరం వేడుకలు

**మద్దికెర,జూలై 28,ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎం అగ్రహారం గ్రామంలో మొహరం వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తాదులు అనేకమంది స్వామి వార్లకు ప్రత్యేక చదివింపులు చేసి వారి ముడుపులు చెల్లించారు. గ్రామంలో ప్రతి ఏటా వివిధ వేషాధారణలతో పురవీధుల నందు దప్పువాయిద్యాల మద్య తిరిగి అగ్నిగుండంలోకి తీసుకెళ్లడం జరుగుతుంది.

## మునగలపాడులో ఓటరు సర్వే



**కర్నూలు రూరల్,జూలై 28,ప్రభాతవార్త :** మండలంలోని మునగలపాడు గ్రామంలో కర్నూలు మండల తహశీల్దార్ శివరాముడు ఆధ్వర్యంలో శుక్రవారం బిఎల్‌ఓ మరియు స్థానిక విఆర్‌ఓ గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ఓటరు సర్వే చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శివరాముడు మాట్లాడుతూ ఓటరు కార్డులో ఏవైన సవరణ చేయాలన్నా లేదా కొత్త ఓటరు కార్డుకు అప్లై చేసుకోవాలన్నా స్థానిక బిఎల్‌ఓ ద్వారా వీటిని చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

## ఘనంగా పెద్దసెరిగేసు వేడుకలు

**హొలహర్వి,జూలై 28,ప్రభాతవార్త :** మండలంలోని కామినహాల్,బాపురం,గూళ్యం,అర్థగేరి,చింతకుంట తదితర గ్రామాల్లో శుక్రవారం మొహరం వేడుకల్లో భాగంగా పెద్దసెరిగేసు వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వాములకు ప్రత్యేక చదివింపులు,ప్రార్థనలు తదితర ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పూలపల్లకి ఊరేగింపు,గంగపూజ నిర్వహించారు. బెల్లం కుంభోత్సవంతో భక్తులు ఊరేగింపు నిర్వహించారు. కామినహాల్ గ్రామంలో పీర్లదేవుని దర్శనం కోసం చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. పీర్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మొహరం వేడుకలు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ హొలహర్వి ఎస్ఐ నాగేంద్ర బందోబస్తు నిర్వహించారు.

## రాష్ట్ర ప్రజలను మోసం చేసిన బిజెపి




**ఆలూరు,జూలై 28,ప్రభాతవార్త :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రత్యేకహోదా, వెనుకబడిన రాయలసీమ జిల్లాలో కడప ఉక్కు పరిశ్రమ,అనంతపురం, కర్నూలు, చిత్తూరులో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పి పదేళ్ల కావస్తున్నా ఇంతవరకు ఏ ఒక్క హామీని నెరవేర్చకుండ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జ్యోతిబసు భవనంలో ఏర్పాటు చేసి విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత ప్రజల హక్కు అయిన కడప ఉక్కు పరిశ్రమ లాభదాయకం కాదని బిజెపి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ రాత పూర్వంగా ఏపి ఎంపిలకు చెప్పడం చూస్తే రాయలసీమ యువత ఆశయాలను హత్య చేసినట్టేనన్నారు. నాడు టిడిపి ప్రభుత్వం కడప ఉక్కు కోసం ఆమరణదీక్ష చేసి నేడు మౌనంగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు 25ఎంపిలు ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తామని చెప్పి కేంద్రం ముందు నడుములు వంచి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి జనసేన భజన చేస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలు మేల్కొని రాష్ట్రంలోని టిడిపి,వైసిపి,జనసేన పార్టీ నిజస్వరూపాన్ని కనిబెట్టి మన హక్కులను మనమే పోరాడి సాధించుకోవాలన్నారు. కావున ఈ నెల 31న రాయలసీమ జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టే ధర్నా యువత,ప్రజాస్వామ్యవాదులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో పిఎస్ రాధాకృష్ణ,హనుమంతు,శేఖర్,కెపి నారాయణస్వామి,షాకీర్ తదితరులున్నారు.

## సమస్యలు పరిష్కారించాలని ధర్నా



**వెలుగోడు,జూలై 28,ప్రభాతవార్త:** ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కారించాలని కోరుతు గ్రామ పంచాయితీ కార్మీకులు, స్వచ్ఛభారత్ కార్మీకులు మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనువాసులు మాట్లాడుతు కార్మీకుల సమస్యలను వెంటనే పరిష్కారించాలని లేని పక్షంలో ఆంధోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏఓ ఉమర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమలో మహ్మద్‌రఫి, నాగమోహన్, జాన్ శిఖామణి, కార్మీకులు వీరాంజనేయులు, యేసు, శాంతమ్మ, హేమలత, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## 'వైభవంగా ముగిసిన మధ్య పరిగెత్తు వేడుకలు'



**మీర్జాపురం(కొలిమిగుండ్ల), జూలై 28, ప్రభాతవార్త :** మండలంలోని మీర్జాపురం గ్రామంలో మధ్య సరిగెత్తు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్ల చావిడిలో కొలువుదీరిన బాదుల్లా స్వామికి ప్రజలు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి నుండి బాదుల్లా స్వామి పీరును నూతన వస్త్రాలతో, రంగు రంగుల కపడాలు, పూల చాందీనీలతో ప్రత్యేకంగా అలంకరించి, డప్పు వాయిద్యాలు, సంగీత నృత్య ప్రదర్శల నడుమ గ్రామ పుర వీధుల గుండా స్వామి వారిని గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్బంగా బాదుల్లో స్వామి అగ్నిగుండం ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామ పుర వీధుల్లో బాదుల్ల పీరుకు కరతాళ ధ్వనుల మధ్య స్వాగతం పలుకుతూ పూజలు చేశారు.

## ర్యాలీని విజయవంతం చేయండి



**పెద్దకడబూరు.జూలై 28,ప్రభాతవార్త:** ఈ నెల 31వ తారీఖున సోమవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులో మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా పాస్టర్ ముత్తు మనోహర్‌బాబు ఆధ్వర్యంలో జరిగే ర్యాలీని వేలాదిమంది క్రైస్తవ సోదరులు పాల్గొని విజయవంతం చేయాలని పాస్టర్లు దేవపుత్ర,జయపాల్,దావీదు, సామేలు, స్వామిదాసు, ఏలియా పిలుపునిచ్చారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ మనదేశంలోని మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవ మహిళలపై జరుగుతున్న దా డులు ప్రతి ఒక్కరిని కలిచి వేస్తుందని తక్షణమే వాటిని ఆపాలని సాటి క్రైస్త వులుగా నిరసన తెలపడం జరుగుతుందన్నారు.మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పాస్టర్లు,క్రైస్తవ సోద రులు తమవంతు బాధ్యతగా పాల్గొని నిరసన తెలపాలన్నారు.

**KURNOOL MUNICIPAL CORPORATION**

e-Procurement Notice

**Tender Notice No.28-1/General Funds/EE&SE/Knl/23-24, dt.28-07-2023 (3 days Short Tender) & Tender Notice No.28-2/General Funds/EE&SE/Knl/23-24, dt.28-07-2023**

| Name of the Scheme | General Funds (3 days Short Tender) | General Funds |
| --- | --- | --- |
| No of works | 01 | 01 |
| Bid document download starting date | 31/07/2023 at 5:30 P.M | 31/07/2023 at 5:30 P.M |
| Bid document download end date | 03/08/2023 at 4:00 P.M | 17/08/2023 at 4:00 P.M |
| Last Date & Time for receipt of Bids | 03/08/2023 at 5:00 P.M | 17/08/2023 at 5:00 P.M |
| Commercial Bid Opening Date | 03/08/2023 at 5:30 P.M | 17/08/2023 at 5:30 P.M |

Further details can be seen @ e procurement market place at www.tender.apeprocurement.gov.in A.Bhargav Teja, I.A.S., Commissioner, Kurnool Municipal Corporation, Kurnool. For Contact 9849908497, 8008403996.

Sd/-A.Bhargav Teja, I.A.S., Commissioner, Kurnool Municipal Corporation, Kurnool.

# లాలుస్వామికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**చాగలమర్రి, జూలై28, ప్రభాతవార్త:** మొహర్రం వేడుకల సందర్భంగా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చిన్నమకానంలో వెలసిన లాలుస్వామికి శు క్రవారం ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర మైనార్టీసెల్ కార్యదర్శి షేక్ బాబులాల్, లాలు స్వామి కమిటీ వారు, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. గాంధీ సెంటర్ నుండి వాయిద్యాల మధ్య ఎమ్మెల్యే ను లాలుస్వామి దర్గా దగ్గరకు తీసుకువెళ్లారు. అక్కడ లాలుస్వామికి ఎమ్మెల్యే ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. లాలుస్వామి కమిటీ అధ్యక్షులు చక్రం ముల్లా షబ్బీర్, మహమ్మద్, ప్రధాన కార్యదర్శి ముల్లా ఖాదర్ బాషా, సహాయ కార్యదర్శి ముల్లా ఇబ్రహీం, మండల ఉపాధ్య క్షుడు ముల్లా రఫిల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను, షేక్‌బాబులాల్‌ను శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. అలాగే పాతబస్టాండ్ సమీపంలో వెలసిన హుస్సేన్‌బాషా స్వామిని కూడా ఆయన దర్శించుకుని ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. స్వామి కమిటీ అధ్యక్షుడు చాంద్‌బాషా ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి సన్మానించారు. అనంతరం స్తానిక చక్రం ముల్లా షబ్బీర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాగలమర్రిలో ప్రతి ఏడాది మొహర్రం వేడుకలు అత్యంత వైభవంగా జరగడం ఈ వేడుకల్లో కులమతాలకు అతీతంగా ప్రజలందరూ పాల్గొని సంతోషంగా ఇలాంటి పండుగ జరుపుకోవడం ద్వారా ఐక్యత పెరిగి గ్రామాలు ప్రశాంతంగా ఉంటాయ న్నారు. రాష్ట్రం, ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని లాలుస్వామిని, హుస్సే న్‌స్వామిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తమ పాలన అందిస్తున్నారని తెలిపారు. పేదల కోసం రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలు కావడంలేదని తెలిపారు. పార్టీలకు, వర్గాలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ వైసీపీని గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా



చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తెలుగుదేశం, పవన్ కళ్యాణ్ లాంటి వాళ్లు ఎంత మంది ఏకమైనా వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఎదుర్కోవడం సాధ్యంకాదన్నారు. ఈ కార్య క్రమంలో ఎంపిటిసి సభ్యులు పత్తి నారాయణ, ఫయాజ్, లక్ష్మిరెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ముల్లా జాబీర్, నాయకులు గణేష్‌రెడ్డి, సర్పంచ్ బంగారు షరీఫ్, వెంకటరమణ, ముల్లా బురానుద్దీన్, అబ్దుల్లా, ఆర్‌ఎస్ రమణ, సుబ్రహ్మణ్యం, ఐడియా బాబు, పి. నాగేంద్ర, రమణారెడ్డి, దామోదర్, జిలేబి బాషా, రామకృష్ణ, నరసింహుడు, మండల ప్రచార కార్యదర్శి పెయింటర్ రఫి, లడ్డూబాయి, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకే

**-స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు**



**నంద్యాల క్రైం, జూలై 28, ప్రభాతవార్త:** మద్యం సేవించి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో తాగినా అట్టివారిపై జరిమానతో పాటు జైలుశిక్ష తప్పదని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి అదేశాల మేరకు అన్నిపోలీస్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ సిఐ అధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురు యర్రంరెడ్డి చిన్నపోల్‌రెడ్డి, ఉల్లి నాగరాజు, దావీదు, చాకలి వెంకటేశ్వర్లులను అరెస్టుచేసి కోర్టు హాజరుపరచగా సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆర్ రాంభూపాల్‌రెడ్డి 10 రోజుల జైలుశిక్ష విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాల్లో పట్టుబడితే కేసులు తప్పవని హెచ్చరించారు. ఎక్కువగా మద్యం సేవించి వాహనాలు నడడం ద్వారానే ప్రమాదంలో ఎన్నోకుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని అవేదన వ్యక్తం చేశారు. మద్యం తాగి మత్తులో వాహనాలు నడిపేటప్పుడు ముందుగా కుటుంబం యొక్క ఆర్థికపరిస్థితులు గుర్తుకుతెచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు ఒక్కసారి జైలుకు వెళ్లితే ఉద్యోగ అవకాశాలు, పాస్‌పోర్టు వంటి విషయాల్లో ఇబ్బదులు ఎదుర్కొవాల్సి వస్తుందని, ఉద్యోగి అయితే ఉద్యోగం నుంచి తొలగించుకునే పరిస్థితి వస్తుందన్నారు. వాహన చోధకులు ట్రాఫిక్ నిబంధనలు, మోటర్ వాహన చట్టాలు పాటిస్తు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

## అలరించి కనువిందు చేసిన ఇంధ్ర ధనుసు



**నంద్యాల విద్య, జూలై 28, ప్రభాతవార్త:** గత వారంరోజులుగా కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల తాకిడికి వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. ప్రజలు బయటకు రాలేని పరిస్థితుల్లో ఉన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలో భారీ వర్షం కురిసింది. అయితే సాయంత్రానికి ఆకాశంలో అకస్మాత్తుగా 7 రంగుల ఇంధ్రధనుసు కనబడింది. దీంతో నంద్యాల పట్టణ ప్రజలు ఇంధ్ర ధనుసును అసక్తిగా తిలకించారు. ఎప్పుడో గానీ ఏర్పడని ఇంధ్ర ధనుసు నంద్యాల పట్టణ ప్రజలకు కనువిందు చేసింది. ఆకాశంలో వెలసిన వివిధ రకాల రంగులతో కలిసిన ఇంధ్రధనసు ఆకాశంలో ఎండతో కలిసి కనిపించింది.

## అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



**ఆదోనిటౌన్, జూలై28, ప్రభాతవార్త ;** పట్టణశివారులోని ఆలూరు రోడ్డు మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆర్చ్ వద్ద బోయ జగ్గాపురం నాగరాజు అనే వ్యక్తి టీవీఎస్ స్కూటీపై శుక్రవారం కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడని టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్ తెలిపారు. సదరు వ్యక్తి వద్ద నుంచి 12 బాక్సుల కర్ణాటక మద్యం, స్కూటీని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యం తరలించినా, విక్రయించినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామన్నారు. కర్ణాటక మద్యం సరఫరా జరగకుండా ఎప్పటికప్పుడు నిఘా ఉంచామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ చంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మండలంలో 8మంది విఆర్‌ఓలు బదిలీ

**:-రిలీవ్ చేయడంలో అధికారుల నిర్లక్ష్యం**

**మంత్రాలయం, జూలై 28, ప్రభాతవార్త:** మంత్రాలయం మండలంలో 8మంది సచివాలయ విఆర్‌ఓలు బదిలీ అయ్యారు. ఈ విఆర్‌ఓలు నెల రోజుల ముందేబదిలీ కావలసి ఉన్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేటివరకు రిలీవ్‌కు నోచుకోవడం లేదు. ఇందులో మాధవరం గ్రామానికి చెందిన విఆర్‌ఓలు సాయినవ్య, మౌనిక 52-బసాపుం హరిత, కాచాపురం పుష్పలత, వగరూరు ఉమ, శ్రవంతి మంత్రాలయం పవన్, కల్లుదేవకుంట విఆర్‌ఓ బ్లాండినాకు బదిలీలు వచ్చాయి. వీరిలో ఎక్కువ మంది విఆర్‌ఓలు కర్నూలు పట్టణం నుండి మంత్రాలయం మండలానికి ప్రతిరోజు విధులకు వస్తూ ఉంటారు. అయితే తమకు బదిలీలు వచ్చినా మండలస్థాయి అధికారులు మాత్రం ఇక్కడి నుండి రిలీవ్ చేయడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తమను ఇక్కడి నుండి రిలీవ్ చేయాలని కోరుతున్నారు.

## బంగారుషాపులో చోరీ...

**ఆదోనిటౌన్, జూలై28, ప్రభాతవార్త ;** పట్టణంలోని బంగారు బజారులో ఉన్న ముఖేష్ జ్యూవెలరీ దుకాణంలో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం వెలుగులకి వచ్చింది. షాపు యజమాని ముఖేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం సాయంత్రం ఉంగరం కావాలని ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడని తెలిపారు. తమ షాపులో ఉంగరం లేకపోతే పక్క షాపులో తెచ్చేందుకు వెళ్లిన వెంటనే ఆ దుండగులు షాపులో ఉన్న చెవికమ్మల పెట్టెను దొంగలించినట్లు తెలిపారు. అందులో మొత్తం 8 తులాల బంగారు చెవికమ్మలు ఉన్నాయని తెలిపారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

# విమానాశ్రయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి

**భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోండి...**
**కలెక్టర్ డాక్టర్ జి.సృజన**



**కర్నూలు జూలై 28, ప్రభాతవార్త :** ఓర్వకల్లు విమానాశ్రయం పరిసరాల్లో ఎటువంటి చెత్తా చెదారాలు లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు విమానాశ్రయ భద్రతకు కావలసిన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన విమానాశ్రయ పర్యావరణ నిర్వహణ కమిటీలో అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఓర్వకల్లు విమానాశ్రయ సమావేశ మందిరం నందు ఏరోడ్రోమ్ కమిటీ మరియు ఎయిర్ ఫీల్డ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి జరగవలసిన విమానాశ్రయ పర్యావరణ నిర్వహణ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ విమానాల రాకపోకలకు 10 కిలోమీటర్ల దూరం విమానాశ్రయ పరిసరాలు అనుకూలంగా ఉండాలన్నారు. అందుకు గాను 10 కిలో మీటర్ల మేరకు విమానాశ్రయ పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఎటువంటి ఆటంకాలు లేకుండా ఉంచుకోవాలన్నారు. సదరు అంశాలను పరిగణలోకి తీసుకొని విమానాశ్రయ పరిసరాలు చెత్తా, చెదారం లేకుండా, పశువులు , పక్షులు ఆకర్షింపబడకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విమానాశ్రయ పరిసరాల్లో మైనింగ్ వల్ల దుమ్ము ధూళి రాకుండా, మైనింగ్ నిమిత్తం పేలుళ్లు జరపకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ మైన్స్ శాఖ వారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ చర్యలు అతిక్రమించిన వారికి పెనాల్టీ విధించాలని కూడా ఆదేశించినారు. విమానాశ్రయ పరిసరాల్లో ఎన్ఆర్ఈజీఎస్ క్రింద పనులు చేపట్టి పరిసరాలని శుభ్రంగా, అందంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకోవాలని ఓర్వకల్లు ఎండిఓను కలెక్టర్ ఆదేశించారు. విమానాశ్రయ అవసరం నిమిత్తం ఇంకా 36 ఎకరాల స్థలము కేటాయింపు పెండింగ్లో ఉందని డైరెక్టర్ తెలుపగా వెంటనే వారికి స్థలం కేటాయించాలని ఓర్వకల్లు తహసిల్దార్‌ని కలెక్టర్ ఆదేశించినారు. పోలీసులు బందొబస్తు గట్టిగా ఏర్పాట్లు చేసుకుని విమానాశ్రయ భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని కర్నూలు ఎస్పీ కి కలెక్టర్ సూచించారు. అనంతరం విమానాశ్రయ ఎయిర్ క్రాష్ ఫైర్ టెండర్ (అగ్నిమాపక శకటం ) లో కలెక్టర్, ఎస్పీ, డైరెక్టర్ విమానాశ్రయ రన్వే మరియు విమానాశ్రయం బౌండరీ ప్రాంతాలను పరిశీలించారు. సమావేశంలో కర్నూలు ఎస్పీ కృష్ణకాంత్, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భార్గవ తేజ, విమానాశ్రయ డైరెక్టర్ విద్యాసాగర్, విమానాశ్రయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కృష్ణయ్య, మధుసూదన్ డిసిఐఓ, డిడి మైన్స్ రాజశేఖర్, డిఎంహెచ్ఓ రామ గిడ్డయ్య, డిపిఓ నాగరాజు నాయుడు, డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ శివశంకర్ రెడ్డి, ఏపీయస్పీ డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్, ఓర్వకల్లు తహసిల్దారు, ఓర్వకల్లు ఎండిఓ, ఇండిగో విమాన సంస్థ ప్రతినిధులు గ్రౌండ్ కంట్రోల్ విభాగము వారు స్థానిక పోలీస్ ఇన్స్పెక్టర్ మొదలగు అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

## చిరుధాన్యాలతో ఆరోగ్యాన్ని సంరక్షించుకోండి

**-జిల్లా కలెక్టరు డా.సృజన**



**కర్నూలు కలెక్టరేట్, జూలై 28, ప్రభాతవార్త:** చిరుధాన్యాలు సిరి ధాన్యాలుగా నేటి ప్రజా జీవితంలో మమేకం అయ్యాయని జిల్లా కలెక్టరు డా. సృజన తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని మిల్లెట్ కేఫ్‌ను కలెక్టరు ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ 2023-24 సంవత్సరం మిల్లెట్ అఫ్ ది ఇయర్‌గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందని అందులో భాగంగా కర్నూలులో మిల్లెట్ కేఫ్‌ను ప్రారంభించడం జరిగింది. ఈయొక్క కేఫ్‌ను జిల్లా వ్యవసాయశాఖ పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్ విత్తన రైతు సేవా సంఘం అధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజారోగ్యానికి సంబంధించిన కార్యక్రమం కాబట్టి జిల్లా కలెక్టరు మరియు శాఖాధికారుల నుంచి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలుపుతూ నేటి ప్రజాజీవన విధానంలో పని వత్తిడితో సరైన సమయంలో ఆహార అలవాట్లు అలవర్చుకోవడంలో విఫలం కావడంతో మధుమేహం, అధికరక్తపోటు, ధీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతన్నారని అలాంటి వారికి ఈ చిరుధాన్యాలు ఎంతగానో ఉపయోపడతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో మిల్లెట్‌కేఫ్ నిర్వాహకులు వేణుబాబును అభినందించారు. అతిథులుగా మహేశ్వర్‌రెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ వరలక్ష్మీ, జిల్లా వ్యవసాయ అధికారి సాయిరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టరు అగ్రికల్చర్ ఉమాదేవి, ప్రాజెక్టు డైరెక్టరు ఏపీఎంఐపి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన తిరుపాల్‌నాయుడు



**తుగ్గలి, జూలై 28, ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును తెదేపా మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు శుక్రవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. తుగ్గలి మండలంలోని టిడిపి పార్టీ పరిస్థితిని ఆయనకు వివరించడం జరిగిందని తెలిపారు. పార్టీ కోసం ప్రతిఒక్కరు కలిసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో పత్తికొండ గడ్డపై తెదేపా జెండాను ఎగురవేయాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారన్నారు.

## మనస్థాపం చెంది మహిళ ఆత్మహత్య

**హాలహర్వి, జూలై 28, ప్రభాతవార్త :** కుటుంబ పోషణ భారమై మనస్థాపం చెంది ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సిద్దాపురం గ్రామంలో చోటుచేసుకుంది. సిద్దాపురం గ్రామానికి చెందిన గోవింద, మంగమ్మ దంపతుల కుమార్తె పార్వతిని హొళగుంద మండలం సులువాయి గ్రామానికి చెందిన బసప్పకు గత పదేళ్ల క్రితం ఇచ్చి పెళ్లిచేశారు. అయితే పార్వతి భర్త బసప్ప గత రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుండి పార్వతి(32) సిద్దాపురం గ్రామంలో తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. అయితే రోజురోజుకు కుటుంబ పోషణ భారం కావడంతో ముగ్గురు పిల్లలను ఎలా పోషించాలని పార్వతి మనస్థాపానికి గురై ఇక కుటుంబ పోషణ తనవల్ల కాదని నిర్ణయించుకుని గురువారం రాత్రి ఇంట్లో అందరు నిద్రిస్తున్న సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పార్వతిని చికిత్స కోసం బళ్లారి ఓపిడి ఆసుపత్రికి తరలించారు. అక్కడ పార్వతి చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందింది. దీంతో తల్లిదండ్రులు మృతిచెందడంతో పిల్లలు ముగ్గురు అనాథలయ్యారు. తల్లి చనిపోవడంతో పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. పార్వతి తల్లిదండ్రులు గోవింద, మంగమ్మలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

## మిస్సింగ్ కేసు నమోదు

**మంత్రాలయం, జూలై 28, ప్రభాతవార్త:** నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలోని రాఘవేంద్రపురంలో ఉన్న మాలపద్మ అనే మహిళ తప్పిపోయినట్లు మంత్రాలయం ఎస్ఐ వేణుగోపాల్‌రాజు శుక్రవారం విలేకరులకు తెలిపారు. పద్మభర్త మాల మన్మధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 27వ తారీఖున అనగా గురువారం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం వద్ద బొట్లుపెట్టు పనిచేసుకోవడానికి వెళతానంటూ వెళ్ళిందని అయితే ఇప్పటివరకు ఇంటికి రాలేదని పేర్కొన్నారు. చుట్టుప్రక్కల, బంధువుల ఇళ్ళవద్ద వెతికామని అయితే ఎక్కడా అచూకీ లభించలేదని వెల్లడించారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్పష్టం చేశారు.

## ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాల ఏర్పాటుపై హర్షం



**ఆదోనిటౌన్, జూలై28, ప్రభాతవార్త ;** ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజస్థాన్‌లో గురువారం ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడం పట్ల బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు విట్టా రమేష్, ఆదోని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆదోని పట్టణంలోని స్తానిక వెంకటేశ్వర ఫర్టిలైజర్ షాపులో మోదీ ప్రసంగాన్ని డిజిటల్ వీడియో ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1.25 లక్షల కేంద్రాలను జాతికి అంకితం చేశారన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి కింద 14వ విడత కింద రూ.19,500 కోట్లు నిధులను, కేంద్రం అందిస్తున్న యూరియా సబ్సిడీ గురించి మోదీ తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా పట్టణాధ్యక్షుడు వెంకటేష్, వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ విక్రమ్ రెడ్డి, ఏడీఏ గిరీష్, ఏఓ అశోక్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు విట్టా రమేష్, రాష్ట్ర కార్యదర్శి కునిగిరి నీలకంఠ, కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిస్వామి, నాయకులు నాగరాజుగౌడ్, తోవి నాగార్జున, అంజయ్య, మహాదేవ్, దేవేంద్ర, ఉరుకుందగౌడ్, బాలాజీ, రైతులు పాల్గొన్నారు.

## ఓటర్ల సర్వేలో అక్రమాలకు పాల్పడితే చర్యలు



**వెల్దుర్తి, జూలై28, ప్రభాతవార్త :** ఇంటింటికి ఓటర్ల సర్వేలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ బిఎల్‌ఓలకు సూచించారు. మండలంలోని చెరుకులపాడు గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటికి ఓటర్ల సర్వేను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఒకే పేరు మీద రెండు ఓట్లు ఉన్నాయని, చనిపోయిన వారి ఓట్లు అలాగే ఉన్నట్లు తమకు ఫిర్యాదు రావడంతో వచ్చినట్లు తెలిపారు. ఈ సర్వే నిష్పక్షపాతంగా చేయాలని బిఎల్‌ఓలకు ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆర్ఐ మస్తాన్ పాల్గొన్నారు.

## ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు - పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ



**తుగ్గలి, జూలై 28, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఇంటి ముంగిటే 11రకాల ప్రభుత్వ సేవలను ఉచితంగా అందచేస్తుందని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ అన్నారు. శుక్రవారం తుగ్గలి, రాతన గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీదేవమ్మ హాజరయ్యారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు స్థానిక వైసిపి నాయకుడు తుగ్గలి మోహన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సత్యప్ప, హనుమంతరెడ్డి, రాతనలో మోహన్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ రాచప్ప, ఎంపిటిసి శ్రీదేవి, సచివాలయ కన్వీనర్లు ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలను నాలుగేళ్లలో ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సిఎం జగనన్నకే సాధ్యమైందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వాలంటీర్లు ప్రజల అర్హత ఆధారంగా వారికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. జగనన్నలాంటి గొప్ప వ్యక్తి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండడం ప్రజల అదృష్టమని కొనియాడారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు కుల, ఆదాయ తదితర ధృవపత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా వేరువేరుగా తహశీల్దార్ రవి, ఎంపిడిఓ సావిత్రి, డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్‌లు అందచేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓలు నాగేంద్ర, రహమాన్, పంచాయతీ సెక్రటరీలు రాజునాయక్, శివ, వక్ఫ్‌బోర్డు చైర్మన్ హుస్సేన్, కోఆప్షన్‌మెంబర్ చాంద్‌భాషా, తుగ్గలి మాజీ సర్పంచ్ పురుషోత్తం, ఫీల్డ్ అసిస్టెంట్లు సురేష్, నరసింహులుతో పాటు సచివాలయ సిబ్బంది, వాలంటరీలు పాల్గొన్నారు.

## శ్రీమఠానికి రూ.1,25,000 విరాళం

**మంత్రాలయం, జూలై 28, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన ఓ భక్తుడు రూ.1,25,000 విరాళం అందించినట్లు మేనేజర్‌లు వెంకటేష్‌జోషి, ఎస్‌కె శ్రీనివాసరావులు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ విరాళాన్ని శాశ్వతసేవకు ఇచ్చినట్లు చెప్పారు. భక్తుడిని పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థులు ఫల, పుష్ప, మంత్రాక్షితలతో ఆశీర్వదించారు.

## మీ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది - నారా చంద్రబాబు



**బేతంచెర్ల, జూలై28, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆర్ బుక్కాపురం గ్రామానికి చెందిన మనీషా అనే మహిళ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం భరోసా ఇచ్చినట్లు స్థానిక టీడీపీ నాయకులు తెలిపారు. డోన్ మండలం చిన్న మల్కాపురం గ్రామంలో మనీషా భర్త వేల్పుల నాగార్జున గత నెల 28వ తేదిన భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ విదు ్యధ్ఘాతానికి గురై మృతి చెందాడు. దీంతో మనీషా తాను, తన కూతుర్ని పోషించుకునేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నానని టీడీపీ మండల కన్వీనర్ యల్ల నాగయ్య దృష్టికి తీసుకొనిపోవడం జరిగింది. దీంతో టీడీపీ మండల ఉపాధ్య క్షులు లక్ష్మన్నతో మనీషా కుటుంబ సభ్యులు మంగళగిరిలోని చంద్రబాబు దగ్గరకు వెళ్లి కలవడం జరిగింది. బిడ్డ చదువుతోపాటు మీ కుటుంబానికి అన్ని విధాలుగా టీడీపీ అండగా ఉంటుందని అధైర్యపడవద్దని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చినట్లు తెలిపారు. వీరితోపాటు బుక్కాపురం గ్రామానికి చెందిన సోమశేఖర్, మనీషా కుటుంబ సభ్యులు ఉన్నారు.

## నాటుసారా విక్రేత అరెస్ట్ - కేసు నమోదు

**బేతంచెర్ల, జూలై28, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎంపెండేకల్ గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నా బాలునాయక్ అనే వ్యక్తిని అరెస్టుచేసి కేసు నమోదుచేసినట్లు ఏఎస్ఐ లింగమయ్య శుక్రవారం తెలిపారు. వివరాల మేరకు వెల్దుర్తి మండలం ఎల్ బండ తండా గ్రామానికి చెందిన బాలునాయక్ ఎంపెండేకల్‌లో సారా విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడిచేసి అతన్ని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 15లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి డోన్ కోర్టులో హాజరుపరిచినట్లు ఏఎస్ఐ తెలిపారు.

## ముగిసిన జగనన్న సురక్ష కార్యక్రమం





**చాగలమర్రి, జూలై28, ప్రభాతవార్త:** జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో చివరి రోజున రెండు సచివాలయాలల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు గోవిందయ్య, శంకరమ్మల అధ్యక్షతన తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపిడివో మహబూబ్ దౌలా, ఈవోఆర్డీ సుదర్శన్‌రావుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటిసి వెంకటరాముడులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేయడం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారన్నారు. ఈ సురక్ష కార్యక్రమంలో రెండు సచివాలయాల్లో 462 ధృవీకరణ పత్రాలు ఉండగా, 234 ఆదాయ ధృవీకరణ పత్రాలు, 218 కులధృవీకరణ పత్రాలు, 7 రీ ఎంట్రీ రైస్‌కార్డులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ రకాల సేవపత్రాలు, కౌలు కార్డులను అధికారులు అందజేశారు. గ్రామంలో వివిధ సంక్షేమ పథకాలతోపాటు పింఛన్లు, రైతుభరోసా, అమ్మఒడి, వసతిదీవెన, నవరత్నాలతోపాటు అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని తిరిగి మళ్లీ ఆశీర్వదించాలని సర్పంచ్‌లు, ఎంపిటిసి వెంకటరాముడు, నీటి సంఘం అధ్యక్షులు శేషు రమేష్‌లు కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో రంగనేతాజీ, పశువైద్యాధికారి సాయిబాబా, ఏఈలు జగ్గయ్య, కొండారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, ఏపీవో నిర్మలా, కార్యదర్శి వై.ఎస్.దాస్, సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీనివాసులు, నాయకులు అంకాల్‌రెడ్డి, సుబ్బరాయుడు, రహిమాన్, లూకా ప్రసాద్, దస్తగిరి, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. చివరి రోజు జగనన్న సురక్ష కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు పాల్గొనకపోవడం కొసమెరుపు.